నేటి కందం- నేటికి అందం

క్షోభలు తొలగించు కొరకు
శోభలు గలిగించు కొరకు సుఖదాయినియై
ప్రాభవము జనుల కొసగగ
భూభారతి యనెడి క్రొత్త పోర్టలు వచ్చెన్ !!

(లోపాలను తొలగించి భూ హక్కు దారులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం తెచ్చిన "భూభారతి" పోర్టల్ నేటి నుండి తెలంగాణా లో అమలు అవుతుంది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

ఐటీ సాఫ్ట్ వేర్ బూం
ఆశలకు కొత్త శ్వాస
కృత్రిమ మేధాను పెంచి
కొలువులూడగొట్టె దశ
ప్రగతికొరకే ఐతేనేమి
ప్రవహించే మార్పుగాలి
మంచే ఐనా ప్రమాదం
మనకంట్లో కొడితే ధూళి

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 4-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:184 పేజీలు:6 వెల: రూ.1/-

## చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు.. అస్సాం ప్రచారంలో అమిత్‌షా

గువాహటి, ఏప్రిల్ 3:చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి తో అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. అస్సాంలోని గోల్‌పాడాలో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడుతూ, తిరిగి తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.

గిరిజనాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమగ్ర మ్యాప్ సిద్ధం చేశారని అమిత్‌షా తెలిపారు. దీనిని ముందుకు తీసుకువెళ్లి, సమర్ధవంతంగా అమలు చేయాలంటే బీజేపీకే ప్రజలు ఓటు వేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో తొలిసారి గిరిజన మహిళ దేశ అధ్యక్షురాలు అయిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఆదివాసీ మహిళలను రాష్ట్రపతి చేయలేదని, మోదీ వచ్చాక పరిస్థితి మారిందని, ద్రౌపది ముర్ము దేశానికి తొలి పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. యూసీసీ నుంచి ఆదివాసీ ప్రాంతాలను మినహాయిస్తామని చెప్పారు.



పొరుగున్న ఉన్న మేఘాలయాలో చొరబాటుదారులు ఇటీవల గరో హిల్స్ అటానమస్ జిల్లా కౌన్సిల్‌లో గిరిజన మహిళలను పెళ్లాడి రాజకీయ పలుకుబడిని సంపాదించే ప్రయత్నం చేశారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని అమిత్‌షా చెప్పారు. అస్సాంలో తమకు మరో ఐదేళ్లు అధికారం ఇస్తే యూజీసీని అమలు చేయడంతో పాటు చొరబాటుదారుల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అస్సాంలో శాంతిని బీజేపీ పునరుద్ధరించిందని, కాంగ్రెస్ తిరిగి వచ్చినా, కొన్ని సీట్లలో నెగ్గినా కూడా తిరిగి రాష్ట్రంలో అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## టెక్స్‌టైల్ ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 3: టెక్స్‌టైల్ ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హెచ్ఐసీసీలో ఏషియన్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడుతూ.. టెక్స్‌టైల్స్ రంగ ప్రముఖులందరికీ తెలంగాణ, హైదరాబాద్ స్వాగతం పలుకుతోందన్నారు. అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర భారతదేశానికి ఉందని తెలిపారు. శతాబ్దాలుగా కళలు, సంస్కృతి, సంప్రదాయాలు టెక్స్‌టైల్స్‌ను పరిపూర్ణంగా తీర్చిదిద్దాయని వివరించారు. తెలంగాణ డీఎన్ఏలోనే టెక్స్‌టైల్ ఉందన్నారు. నిజాం కాలంలో ప్రపంచం నలుమూలల నుంచి వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారని తెలిపారు. టెక్స్‌టైల్ కేవలం పరిశ్రమ కాదని.. జీవనాధారమని చెప్పారు. టెక్స్‌టైల్స్ రంగంలో తెలంగాణ ముందంజలో ఉండటానికి చారిత్రక కారణాలు ఉన్నాయని వెల్లడించారు.

డీప్‌టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఎనర్జీ ఇలా అనేక రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉందని సీఎం తెలిపారు. తమ విజన్ 'తెలంగాణ రైజింగ్ 2047' మరోసారి స్పష్టం చేశారు. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేశామన్నారు సీఎం. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా మారడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాలో టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు.

ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారిందని తెలిపారు. ఇటీవల నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోలను ఇక్కడ ప్రారంభించిందన్నారు. టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైదరాబాద్‌ను తమ కేంద్రంగా ఉపయోగిస్తున్నాయని.. ఇప్పుడు హాలీవుడ్ కూడా చేరిందని అన్నారు. చిత్ర పరిశ్రమను తెలంగాణలో ప్రోత్సహిస్తామని వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణే తమ తొలి ప్రాధాన్యం అని సీఎం పేర్కొన్నారు. గ్రీన్ టెక్స్‌టైల్స్ హబ్‌లను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రపంచంలోని ప్రతి దేశంలో తెలంగాణలో తయారైన దుస్తులు ధరించేలా చేయడమే తమ లక్ష్యమన్నారు. తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో భాగస్వాములు కావాలని పెట్టుబడిదారులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఏషియన్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అరిదమన్ అనేది ఒక శక్తి: కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

విశాఖపట్నం, ఏప్రిల్ 03: అరిదమన్ అనేది ఒక పదం కాదని.. ఒక శక్తి అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. శుక్రవారం విశాఖపట్నంలో భారత్ తన మూడో స్వదేశీ అణు బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిదమన్‌ను ఆయన నౌకాదళంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. భారత్ మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ అరిదమన్ అని తెలిపారు.

దీంతో సముద్ర ఆధారిత అణు నిరోధకశక్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పని చేస్తున్న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెబోరేటరీ (ఎన్ఎస్‌టీఎల్)ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అందులోని కావిటేషన్ టన్నెల్‌కు సైతం ఆయన శంకుస్థాపన చేశారు.

2016లో ఐఎన్ఎస్ అరిహంత్, 2024 ఆగస్టులో ఐఎన్ఎస్ అరిఘాట్‌ల సరసన తాజాగా ఐఎన్ఎస్ అరిదమన్ చేరింది. అరిదమన్ చేరికతో.. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మించి, నిర్వహిస్తున్న అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి ఎంపిక చేసిన దేశాల క్లబ్‌లో భారత్ చేరింది. ఈ జలాంతర్గాములు శత్రువుల కంటపడకుండా నెలల తరబడి సముద్రగర్భంలో ఉంటాయి. శత్రు దేశాల నుంచి అణు దాడి జరిగితే.. సముద్రం లోపలి నుంచే దీటుగా ఇవి బదులిస్తాయి.

## డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తూ అడ్డంగా బుక్కైన నైజీరియా మహిళ

హైదరాబాద్, ఏప్రిల్ 3:డ్రగ్స్ రవాణా చేస్తున్న నైజీరియన్ మహిళను సికింద్రాబాద్ డీటీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముంబై నుంచి హైదరాబాద్‌కు మాదకద్రవ్యాలు ఆమె రవాణా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో సదరు మహిళ నుంచి 2.35 లక్షల విలువైన 7.5 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఐదు పాకెట్లలో దాచి డ్రగ్స్ తెస్తుండగా పట్టుకున్నారు పోలీసులు. నిందితురాలిని నైజీరియాకి చెందిన జేమ్స్ టెస్లింగ్ యామ్యూనల్‌గా గుర్తించారు. ముంబైలో గ్రాము రూ.15 వేల చొప్పున కొనుగోలు చేసి హైదరా బాద్‌కు తెస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ గ్రాము కొకైన్ రూ.30 వేల చొప్పున విక్రయించి సొమ్ము చేసుకునేందుకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## ఓయూ తెలుగు శాఖ బీఓఎస్ చైర్మన్‌గా శ్రీరామోజు రఘు



నల్గొండ, ఏప్రిల్ 3: ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా నల్లగొండ జిల్లా వాసి శ్రీరామోజు రఘు నియమితులయ్యారు.

శ్రీరామోజు రఘు పాఠశాల స్థాయి ప్రాథమిక తెలుగు పాఠ్య పుస్తకాల రూపకల్పన నుండి విశ్వవిద్యాలయ స్థాయి పాఠ్యాంశాల నిర్మాణం వరకు తన విశిష్ట ప్రతిభను చాటుకున్నారు. విద్యావేత్తగా, సాహిత్య సేవకుడిగా గుర్తింపు పొందిన డా. శ్రీరామోజు రఘు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం తెలుగు సాహిత్య రంగానికి గర్వకారణంగా పలువురు పేర్కొంటున్నారు. ఈ పదవిలో ఆయన మరింత సమర్ధవంతంగా పనిచేసి, తెలుగు విద్యా వ్యవస్థకు నూతన దిశానిర్దేశం చేయాలని జిల్లాకు చెందిన ప్రముఖ అధ్యాపకులు, కవులు, రచయితలు, పరిశోధన విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన డాక్టర్ ఇడికోజు శ్రీనివాసాచారి, పరిశోధక విద్యార్థి పల్లె సతీశ్ ఆయనను కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మేడారంలో ఘోర ప్రమాదం.. రాతి కట్టడం పడి బాలుడి కాలు తొలగింపు

ములుగు, ఏప్రిల్3: ప్రముఖ పుణ్యక్షేత్రం మేడారంలో తీవ్ర విషాదం నెలకొంది. ఊహించని రీతిలో జరిగిన ప్రమాదం.. ఒక చిన్నారి జీవితంలో చీకటిని నింపింది. మేడారం పూజారి సిద్ధబోయిన రమేశ్ కుమార్ కొడుకు యువన్‌పై ఒక్కసారిగా రాతి కట్టడం కూలి పడటంతో ఈ దారుణం జరిగింది. వెంటనే తల్లిదండ్రులు చిన్నారిని ఆసుపత్రికి తరలించారు.

స్థానికుల సమాచారం ప్రకారం.. బాలుడు యువన్ ఆడుకుంటున్న సమయంలో సమీపంలోని ఒక రాతి కట్టడం ఒక్కసారిగా అతడిపై పడింది. ఈ ప్రమాదంలో బాలుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే యువన్ తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బాలుడిని తల్లిదండ్రులు హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయం తీవ్రంగా ఉండటంతో ఇన్ఫెక్షన్ సోకకుండా ఉండేందుకు తప్పనిసరి పరిస్థితల్లో కాలును తొలగించాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు. తమ కళ్ల ముందు ఆడుకోవాల్సిన బిడ్డ.. ఇలా కాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో వారి ఆవేదన చూసి స్థానికులు సైతం చలించిపోయారు.

## మరో విమానాన్ని కూల్చామన్న ఇరాన్.. తప్పించుకున్న పైలట్.. బంధించాలంటూ ప్రజలకు పిలుపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:అమెరికాకు చెందిన ఎఫ్ 35 యుద్ధ విమానాన్ని కూల్చామని ప్రకటించిన ఇరాన్.. ఇప్పుడు ఇంకో అమెరికా విమానాన్ని కూడా కూల్చినట్లు వెల్లడించింది. ఎఫ్15 ఈ అనే మరో యుద్ధ విమానాన్ని కూడా కూల్చినట్లు తెలిపింది. ఈ ఘటనలో పైలట్ తప్పించుకున్నాడని, అతడిని ఎక్కడున్నా పట్టుకోవాలని ఇరాన్ మీడియా కోరింది. మరోవైపు ఇప్పటికే ఒక పైలట్‌ను ఇరాన్ బంధించినట్లు ఇంకో ప్రచారం జరుగుతోంది.

ఇరాన్ సైన్యం అయిన ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ఫోర్స్ జరిపిన ప్రతి దాడిలో అమెరికాకు చెందిన ఎఫ్35 యుద్ధ విమానం కూలింది. నైరుతి ఇరాన్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో పైలట్ తప్పించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఘటనా స్థలికి స్థానికులు, అధికారులు భారీ ఎత్తున చేరుకున్నారు. పైలట్‌ను వారు పట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే, అతడిపై దాడి చేయొద్దని అక్కడి ఆర్మీ కోరినట్లు సమాచారం. అలాగే, ఎఫ్15ఈ అనే మరో యుద్ధ విమానాన్ని కూడా ఇరాన్ కూల్చినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఈ విమానానికి సంబంధించిన శకలాలను కూడా అధికారులు గుర్తించారు. పైలట్‌కు సంబంధించిన ఆచూకీ మాత్రం తెలియలేదు. కానీ, అతడు కూడా తప్పించుకుని ఉంటాడని భావిస్తున్నారు. దీనిపై ఇరాన్ మీడియా ఒక ప్రకటన చేసింది.

## ఎన్నికల ప్రచారంలో అసత్య ప్రచారాలు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి..

హైదరాబాద్, ఏప్రిల్ 3:కేరళంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశామని, కావాలంటే కేరళ ప్రజలు వచ్చి చూడాలని చెప్పడం విడ్డూరం ఉందని అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు తెలంగాణలో పూర్తిగా విఫల మయ్యాయని.. ఒక్క పథకం కూడా సమర్ధవంతంగా అమలు కాలేదన్నారు. అమలు చేయని పథకాలను అమలు చేసినట్టు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. ఇది సాధారణ అబద్ధం కాదని.. ప్రజలను మోసం చేసే ప్రయత్నమని కిషన్ రెడ్డి ఆగ్రహించారు.



ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ..'మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పారు, ఇచ్చారా?. పెన్షన్లు రూ.2,000 నుంచి రూ.4,000 చేస్తామని, దివ్యాంగులకు రూ.3,000 నుంచి రూ.6,000 చేస్తామని చెప్పారు, అమలు చేశారా... దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు... ఇచ్చారా... బీసీలకు రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పారు.. రెండు సంవత్సరాల పాలనలో ఒక్క ఏడాది కూడా రూ.20 వేల కోట్లు ఇవ్వలేకపోయారు. ఇవన్నీ కేరళ ప్రజలకు చెప్పగలరా.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయకపోవడం మోసమైతే.. అమలు చేశామని చెప్పడం మరింత పెద్ద మోసం. తప్పుడు ప్రచారం, అబద్ధాలు చెప్పడం ప్రజలను దగా చేయడమే.

తెలంగాణలో పెళ్లయిన ఆడబిడ్డలకు తులం బంగారం ఎక్కడ... ఉచిత ఎలక్ట్రిక్ స్కూటర్లు ఎక్కడ... నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ... నిరుద్యోగ భృతి ఎక్కడ... ఈ హామీలన్నీ ఎక్కడికి పోయాయి... ఇవన్నీ చేయకపోయినా.. గ్యారెంటీలు అమలు చేశామని కేరళంలో రేవంత్ రెడ్డి చెప్పడం ఎంత పెద్ద మోసమో ప్రజలు అర్థం చేసుకోవాలి. కాంగ్రెస్ మాటలను నమ్మకండి. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలు కేరళం ప్రజలను మోసం చేశాయి. గత 10 సంవత్సరాలుగా అభివృద్ధిని అడ్డుకున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ వస్తే అవినీతి మరింత పెరుగుతుంది. రేవంత్ రెడ్డి మాటలకు కేరళంలో విలువ లేదు. ఆయన ఎందుకు అక్కడికి వెళ్లారో అందరికీ తెలుసు. తెలంగాణ నుంచి డబ్బులు పంపుతున్నారనే అనుమానాలు ప్రజల నుంచి వస్తున్నాయి. అందుకే ఆ పార్టీ నాయకులను అక్కడికి పిలుస్తున్నారు. ఉపన్యాసాలు ఇవ్వమని పిలుస్తున్నారు కానీ ఓట్లు మాత్రం పడవు.

## బీఆర్ఎస్ ఖాళీ.. బీజేపీకి చోటు లేదు: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ధ్వజం

హైదరాబాద్, ఏప్రిల్ 3: తెలంగాణ రాజకీయాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదని ఆయన అన్నారు.

గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని రకాల కుట్రలు పన్నినా.. కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉంది. అందుకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు.

## భారత్‌కు మరింత చమురు సరఫరా.. హామీ ఇచ్చిన రష్యా.. ఇండియాలో రష్యా నేత పర్యటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఇండియా చమురు కొరతను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇండియాకు మరింత చమురు సరఫరా చేయాలని రష్యా నిర్ణయించింది. ఆయిల్, లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) సరఫరాను పెంచబోతున్నట్లు రష్యా శుక్రవారం ప్రకటించింది. రష్యా మొదటి డిప్యూటీ ఛైర్మన్ డెనిస్ మాంటురోవ్ ప్రస్తుతం ఇండియాలో పర్యటిస్తున్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీతో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ భేటీ సందర్భంగా చమురు సరఫరాపై హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. భారత అవసరాలకు సరిపడా చమురును అందించే సత్తా రష్యన్ కంపెనీలకు ఉందని, చమురు ఉత్పత్తి పెంచుతామని డెనిస్ అన్నారు. ఈ అంశంపై ఇండియాలోని రష్యన్ ఎంబసీ కీలక ప్రకటన చేసింది. దీని ప్రకారం.. రష్యా గత ఏడాది చివరినాటికి మినరల్ ఫెర్టిలైజర్స్ సరఫరాను 40 శాతం పెంచింది. భవిష్యత్తులో భారత అవసరాలకు అనుగుణంగా మరింత పెంచేందుకు సిద్ధంగా ఉంది. అణుశక్తి అంశంలో రష్యా, ఇండియా తమ భాగస్వామ్యాన్ని పెంచుకుంటున్నాయి. దీనిలో భాగంగానే కుడంకులామ్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ కోసం పవర్ యూనిట్స్ నిర్మిస్తోంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.



ఇరు దేశాలు కలిసి సంయుక్తంగా యూరియా ఉత్పత్తి ప్రాజెక్టును ప్రారంభించబోతున్నాయి. అణుసహకారంలో కూడా ఇరు దేశాలు కలిసి పని చేస్తున్నాయి. పరిశ్రమలు, అంతరిక్షం, విద్య, ఇన్నోవేషన్, వాణిజ్యం, టెక్నాలజీ, ఖనిజాలు వంటి అంశాల్లో కూడా రెండు దేశాలు మరింతగా కలిసి పని చేయాలని నిర్ణయించాయి.

# జీవ వైవిధ్య పరిరక్షణలో ఎముకలు !

## (04 ఏప్రిల్ "ప్రపంచ ఎలుకల దినం" సందర్భంగా)

మానవుడి జన్యు 'డిఎన్ఏ'తో దాదాపు 99 శాతం పోలి ఉన్న చురుకైన జంతువు ఎలుక. ప్లేగ్ లాంటి భయానక వ్యాధుల వ్యాప్తికి కారణమైన ఎలుకలు, పర్యావరణ హితవరులుగా ప్రధాన భూమికను నిర్వహిస్తున్నప్పటికీ మన నిత్యజీవితంలో ద్వేషాన్ని మాత్రమే చవి చూస్తున్నాయి. ఇంట్లోని కన్నాల్లో లేదా పై కప్పులు లేదా స్టోర్ రూమ్‌లను తమ ఆవాసాలుగా చేసుకొని దొంగ చాటున ఆహార పదార్థాలను/ధాన్యాలను తినడం, పలు వస్తువులను కొరికి రంధ్రాలు చేయడంతో కుటుంబ సభ్యుల కోపానికి కారణం కావడం, రొటెంటిసైడ్ మందు పెట్టి చంపే వరకు వెళ్లడం జరుగుతోంది. వినాయకుడి వాహనంగా పూజలు అందుకుంటున్నప్పటికీ ఎలుకలు అంటే మనుషులు తమ ఆవేశాన్ని, ప్రతాపాన్ని వాటి పై చూపుతారు. ప్రత్యేక లక్షణాలు కలిగిన ఎలుకలు చాలా చురుకుగా కదులుతూ విలక్షణ గుణాలను ప్రదర్శిస్తాయి. పలు విధాలుగా మానవాళి సంక్షేమానికి కారణం అవుతున్న ఎలుకలను సాదు జంతువులుగా కూడా పెంచుకోవడం కొన్ని కుటుంబాల్లో జరుగుతుంది. ప్రత్యేక ప్రయోజనాలు కలిగిన ఎలుకల జాతి పట్ల ప్రేమ, సంరక్షణ, శ్రద్ధ లాంటివి చూపడం మన కర్తవ్యం అని తెలుసుకోవాలి.

### ప్రపంచ ఎలుకల చరిత్ర – ప్రపంచ ఎలుకల దినోత్సవం:

పెద్ద తోకతో మధ్యస్థ ఆకారం కలిగిన ఎలుకలు జంతుశాస్త్ర పరంగా "మురాయిడే" అనే జాతికి చెందినవిగా వర్గీకరించబడింది. అద్భుత అలవాట్లు, చలాకీతనం కలిగిన ఎలుకలు 2 లక్షల ఏండ్ల క్రితంతో మొదలై డైనోసార్ల యుగం దాటుతూ నేటి వరకు మానవ ఆవాసాల్లో ఒక కుటుంబ సభ్యుడి వలె బతుకుతూ ఉన్నాయి. ఎలుక కనబడితే ఇంట్లోంచి తరమడం, తొలగించటం, చివరకు మందు పెట్టి చంపేయడం జరుగుతుంది. అన్ని రకాలైన జంతువులు, వృక్ష జాతుల వలె ఎలుకలు కూడా పలు ప్రయోజనాలతో పాటు నష్టాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ ఎలుకల జాతి చేస్తున్న సేవలను దృష్టిలో ఉంచుకొని ఎలుకలను కూడా సాదు కావడానికి ప్రయత్నాలు చేసే కుటుంబాలు కూడా ఉన్నాయి. ఈ విధంగా పలు ప్రయోజనాలు ఉన్న ఎలుకలను కాపాడుకోవడం, వాటికి తగు ఆహారం అందించడం లాంటి చర్యలను తీసుకోవలసిన అవసరాన్ని అవగాహన పర్చడానికి ప్రతి ఏట 04 ఏప్రిల్‌న "ప్రపంచ ఎలుకల దినం లేదా వరల్డ్ ర్యాట్ డే" పాటించుట 2002 నుంచి ఆనవాయితీగా మారింది.

### ఎలుకల వల్ల వ్యాపించే వ్యాధులు:

ఆసియా ప్రాంతాల్లో కనిపించినా ఎలుకలు కాల క్రమంలో మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా ప్రాంతాలకు వ్యాపించాయి. మానవ పరిణామ క్రమానికి సాక్షులుగా నిలబడిన ఎలుకల వల్ల మానవాళికి ప్లేగ్, హంటావైరస్ పల్మొనరీ సిండ్రోమ్, హెప్టోస్పైరోసిస్, ర్యాట్-బైట్ ఫివర్, సాల్మనెల్లోసిస్, టైఫస్, ఎరినావారన్, తులరేమియా, లింఫోసైటిక్ క్లోరియోమెనింజైటిస్, లెస్సా ఫివర్ లాంటి వ్యాధులు వ్యాపిస్తాయి.

### ఎలుకల వల్ల కలిగే ప్రయోజనాలు:

మానవాళికి ఎలాంటి హానిని తలపెట్టని ఎలుకలు మనిషి కోపాన్ని మాత్రమే చూస్తూ, భయపడుతూ, పరుగెడుతున్న చురుకైన జంతువులు. సాదు ఎలుకల వల్ల ఎలాంటి హాని ఉండదు. వాటిని తగు జాగ్రత్తలు తీసుకుంటూ పెంచుకునే వారికి ఎలాంటి వ్యాధులు వ్యాపించవు. పర్యావరణ, జీవ వైవిధ్యాలను కాపాడడంలో ఎలుకలు తమ బాధ్యతలను నిర్వహిస్తున్నాయి. క్రిమి కీటకాల జనాభాను నియంత్రించడం, ఇతర జంతువులకు ఆహారంగా ఉపయోగపడడం, ఆహార చక్రం అదుపు చేయడం, విత్తనాలను వ్యాప్తి చేయడం, జీవ వైవిధ్యాలను పెంచి పోషించడం, మానవ సంబంధ ఔషధాల పని తీరును నిర్ధారించడానికి ఎలుకలపై ప్రయోగాలతో పరిశోధనలకు ఉపకరించడం, జీవ వ్యవస్థలపై ఔషధాల ప్రభావాలను తెలుసు కోవడం, జన్యుపరమైన/న్యూరోబయాలజీ సంబంధ పరిశోధనలకు వాడుకోవడం లాంటి పలు ప్రయోజనాలు ఉన్నాయి.

కొంత అసౌకర్యాన్ని కల్పిస్తున్నప్పటికీ ఎలుకల జాతికి ఆహారాన్ని అందిస్తూ కాపాడుకోవడం మన సనీస అవసరం అని తెలుసుకుందాం. జిత్తులమారి ఎలుకలను సాదు జంతువులుగా పెంచుకుందాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# సుమారు 46.85 కిలోలు స్వాధీనం..

### -రూ.23 లక్షల విలువైన గంజాయి స్వాధీనం
### -రైల్వే స్టేషన్ వద్ద నిందితులను అదుపులో తీసుకున్న పోలీసులు
### -నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు
### -వివరాలు వెల్లడించిన ట్రైనీ ఐపీఎస్ అధికారి మనీషా నెహ్రా

అమరావతి, ఏప్రిల్ 3: స్టేషన్ ఘన్‌పూర్ పోలీసుల అప్రమత్తతతో సుమారు 46.85 కిలోల భారీ గంజాయి పట్టుబడింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరా లను శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి మనీషా నెహ్రా వెల్లడిం చారు. గురువారం మధ్యాహ్నం సుమారు 2:30 గంటల సమయంలో ఎస్ఐ పిట్ట రాజేష్ సిబ్బందితో కలిసి పట్టణంలో సాధారణ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఘన్‌పూర్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నప్పు డు ఒక పురుషుడు, ఒక మహిళ ఐదు బ్యాగులతో అనుమానాస్పదం గా తిరుగుతున్నట్లు గమనించారు. పోలీసులు వారిని ప్రశ్నిం చేందుకు ముందుకు వెళ్లగా, పోలీసుల రాకను గుర్తించిన ఆ ఇద్దరు అక్కడి నుం చి తప్పించుకునేందుకు ప్రయత్నించారు.

అయితే అప్రమత్తంగా స్పం దించిన పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. అనం తరం వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా అందులో భారీగా గంజాయి ఉన్నట్లు గుర్తించారు. పోలీసుల విచారణలో నిందితులు సత్యరంజన్ బారెల్, దీప్తి మాయి స్వైన్‌లుగా గుర్తించారు. వారు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ నుంచి మహారాష్ట్రలోని ముంబాయి దాదర్ ప్రాంతానికి గంజాయిని అక్రమంగా తర లించి విక్రయించడం ద్వారా అధిక లాభాలు పొందాలని యత్నిస్తున్నట్లు అంగీకరించారు. మొత్తంగా నిందితుల వద్ద నుంచి సుమారు 46.85 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

అదనంగా రెండు మొబైల్ ఫోన్లు, రూ.2,690 నగదు, ట్రైన్ టికెట్‌ను కూడా పోలీసులు జప్తు చేశారు. పట్టుబడిన గంజాయి మార్కెట్ విలువ సుమారు రూ.23.20 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ ఘటనపై ట్రైనీ ఐపీఎస్ అధికారి మనీషా నెహ్రా పర్యవేక్షణలో నింది తులపై మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్ఐ మనీషా ఉన్నారు.

# భారత ప్రధాని మోదీతో రష్యా మొదటి ఉప ప్రధాని డెనిస్ మంతురోవ్ భేటీ

గౌరవ రష్యా మొదటి ఉప ప్రధానమంత్రి డెనిస్ మంతరోవ్.. ఈ రోజు భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని కలిశారు.

వాణిజ్య – ఆర్థిక భాగస్వామ్యం, ఎరువులు, అనుసంధానం, ప్రజా సంబంధాలు సహా.. ఇరుపక్షాలకు ప్రయోజనకరమైన వివిధ రంగాల్లో సహకారంతో సాధించిన పురోగతిని రష్యా మొదటి ఉప ప్రధాన మంత్రి మంతురోవ్ భారత ప్రధానమంత్రికి వివరించారు.

2025 డిసెంబరులో 23వ భారత్ – రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సు సందర్భంగా, ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ భారత్‌లో విజయవంతంగా పర్యటించిన సందర్భాన్ని భారత ప్రధాన మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

భారత్ – రష్యా ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా.. వార్షిక శిఖరాగ్ర సదస్సులో తీసుకున్న నిర్ణయాల అమలు దిశగా ఇరుపక్షాల నిరంతర కృషి పట్ల శ్రీ మోదీ సంతృప్తి వ్యక్తం చేశారు.

రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపిన శ్రీ మోదీ.. ఇరు దేశాల మధ్య నిరంతర చర్చలు ఇకముందూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.

# ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా, పౌరుల పట్ల మరింత సున్నితంగా మార్చడమే లక్ష్యం:ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:సామర్థ్య నిర్మాణ కమిషన్ (సీబీసీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన 'కర్మయోగి సాధన సప్తాహం'ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు.

సామర్థ్య నిర్మాణ కమిషన్ (సీబీసీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కర్మయోగి సాధనా సప్తాహంను ఉద్దేశించి వీడియో సందేశం ద్వారా ప్రధానమంత్రి మాట్లాడు తూ.. పాల్గొన్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

వేగంగా మారుతున్న ప్రపంచ వ్యవస్థలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం కూడా ఎప్పటి కప్పుడు తనను తాను ఆధునీ కరించుకోవాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రపంచానికి అనుగుణంగా భారత్ కూడా శరవేగంగా దూసుకుపోతుందని అన్నారు. "21వ శతాబ్దంలో మన ప్రభుత్వ సేవలు సందర్భోచితంగా, బాధ్యతాయుతంగా ఉండేలా చూసే ఆ ప్రయత్నంలో కర్మయోగి సాధనా సప్తాహం ఒక ముఖ్యమైన వారధి వంటిది" అని తెలిపారు.

నేటి పరిపాలన మార్గదర్శక తత్వాన్ని వివరిస్తూ..పౌరుడిని అత్యున్నతంగా భావించే 'నాగరిక్ దేవో భవ' అనేదే పరిపాలనను నడిపించే ప్రధాన మంత్రమని ప్రధానమంత్రి శ్రీ మోదీ పేర్కొన్నారు. ప్రజా సేవలను పౌరుల పట్ల మరింత సమర్థవంతంగా, మరింత సున్నితంగా ఉండేలా పునర్నిర్మిస్తున్నామని ఆయన చెప్పారు. "పాలనను నిజమైన పౌర కేంద్రీకృతంగా మార్చడం ద్వారా దానికి సరికొత్త గుర్తింపు నిస్తున్నాం"అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

సామర్థ్య నిర్మాణ కమిషన్ ఆవిర్భావం గురించి ప్రధాన మంత్రి మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అనేక సంస్థలు వివిధ అంశాలపై దృష్టి సారించి పనిచేస్తున్నప్పటికీ, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ఒక ప్రత్యేక విభాగం ఉండాల్సిన అవసరం స్పష్టంగా కనిపించిందని తెలిపారు. "ఈ ఆలోచన నుంచే సామర్థ్య నిర్మాణ కమిషన్ ఆవిర్భవించింది. ఇది వ్యవస్థలోని ప్రతి కర్మయోగిని సాధికారికం చేయడంపై దృష్టి సారిస్తుంది" అని పేర్కొన్నారు. సీబీసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అభినందనలు తెలిపారు. ఐగాట్ మిషన్ కర్మయోగి విజయవంతాన్ని గుర్తుచేస్తూ.. ఈ ప్రయత్నాలు ఆధునిక, సమర్థవంతమైన, అంకితభావం కలిగిన, సున్నిత మనస్తత్వం గల కర్మయోగిల బృందాన్ని నిర్మిస్తాయని శ్రీ మోదీ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమాన్ని వికసిత్ భారత్ విస్తృత దార్శనికతతో ముడిపెడుతూ.. ఇటీవల సేవా తీర్థ్ ప్రారంభోత్సవంలో తాను చేసిన ప్రసంగాన్ని ప్రధానమంత్రి గుర్తు చేశారు. వేగవంతమైన ఆర్థిక వృద్ధి, ఆధునిక మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, భారీ నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి అవసరాన్ని ఆయన పునరుద్ఘాటించారు. ఈ లక్ష్యాలను సాధించడంలో ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని చెప్పారు. "నేటి భారత్ తీవ్ర ఆకాంక్షలతో ఉంది. ప్రతి పౌరుడికి కలలు, లక్ష్యాలు ఉన్నాయి. వాటిని నెరవేర్చడానికి పూర్తి మద్దతు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

పౌరుల జీవన సౌలభ్యం, జీవన ప్రమాణాలను మెరుగు పరచడమే పరిపాలనకు గీటురాయి కావాలని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రతిరోజూ కొత్త విషయాలను నేర్చుకోవాలని, నిజమైన కర్మయోగి స్ఫూర్తితో తమను తాము మలచుకోవాలని ఆయన కోరారు. "పౌరుల జీవన ప్రమాణాలు రోజురోజుకూ మెరుగుపడేలా మన పరిపాలన ఉండాలి, ఇదే మన అసలైన ప్రమాణం'' అని శ్రీ మోదీ చెప్పారు.

పరిపాలనా సంస్కృతిలో ప్రాథమిక మార్పు రావాలని పిలుపునిస్తూ, పాత వ్యవస్థ 'అధికారి'అనే హోదాకు అమితమైన ప్రాధాన్యతనిచ్చిందని, అయితే నేడు దేశం పూర్తిగా కర్తవ్య స్ఫూర్తిపై దృష్టి సారిస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. విధులను నెరవేర్చడం ద్వారానే రాజ్యాంగం హక్కులను కల్పిస్తుందని ఆయన గుర్తు చేశారు. ''ప్రతి నిర్ణయానికి ముందు, మీ కర్తవ్యం ఏంటో మీరు ఆలోచించినప్పుడు.. మీ నిర్ణయాల ప్రభావం దానంతట అదే అనేక రెట్లు పెరుగుతుంది" అని ప్రధాని మోదీ అన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు తమ ప్రస్తుత పనిని భవిష్యత్తు అనే విశాల కోణంలో చూడాలని ప్రధానమంత్రి శ్రీ మోదీ కోరారు. తమ వ్యక్తిగత నిర్ణయాలు లక్షలాది మంది జీవితాలను ఎలా మార్చగలవో, అలాగే వ్యక్తిగత పరివర్తన సంస్థాగత పరివర్తనకు ఎలా దారితీస్తుందో నిరంతరం ఆలోచించాలని సూచించారు. తన వ్యక్తిగత అనుభవాన్ని వివరిస్తూ, ఇటువంటి పరివర్తనాత్మక పనులకు అపారమైన శక్తి అవసరమని పేర్కొన్నారు. "ఈ శక్తి కేవలం నిస్వార్థ సేవా భావం ద్వారా మాత్రమే లభిస్తుంది" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

సాంకేతికత ప్రాముఖ్యత గురించి ప్రస్తావిస్తూ.. గత పదకొండేళ్లుగా పాలన, సేవల పంపిణీ, ఆర్థిక వ్యవస్థతో సహా ప్రభుత్వ కార్యకలాపాల్లో సాంకేతికత విడదీయలేని భాగమైందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. కృత్రిమ మేధ రాకతో ఈ మార్పులు మరింత వేగవంతం కానున్నాయని ఆయన పేర్కొన్నారు. ''సాంకేతికత, డేటాపై పటిష్టమైన అవగాహన ఉన్నవారే ఉత్తమ నిర్వాహకులుగా, ఉత్తమ ప్రజా సేవకులుగా రాణిస్తారు. నిర్ణయాలు తీసుకోవడానికి ఇదే ప్రాతిపదిక కావాలి" అని శ్రీ మోదీ చెప్పారు. ఈ సాధన సప్తాహంలో ఏఐ రంగంలో సామర్థ్య పెంపు, నిరంతర అభ్యాసంపై ప్రధానంగా దృష్టి సారించాలని ఆకాంక్షించారు.

దేశ సమాఖ్య నిర్మాణాన్ని ప్రస్తావిస్తూ.. అన్ని రాష్ట్రాల ఉమ్మడి విజయమే దేశం సాధించే విజయమని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దశాబ్దాల కాలంగా ఉన్న అభివృద్ధి చెందిన రాష్ట్రాలు, వెనుకబడిన రాష్ట్రాలు, బీమారు రాష్ట్రాలుఅనే వర్గీకరణలు ఇప్పుడు తొలగిపోతున్నాయని, రాష్ట్రాల మధ్య ఉన్న అంతరాలను సమాన కృషితో పూడ్చాలని ఆయన అభిప్రాయపడ్డారు. 'మనం విభాగాల మధ్య ఉన్న అడ్డంకులను తొలగించి, మెరుగైన సమన్వయం, ఉమ్మడి అవగాహన, సంపూర్ణ ప్రభుత్వ విధానంతో ముందుకు సాగాలి. అప్పుడే ప్రతి లక్ష్యం విజయం సాధిస్తుంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

సామాన్య పౌరుడికి స్థానిక ప్రభుత్వ కార్యాలయమే మొత్తం ప్రభుత్వ ముఖచిత్రమని ప్రభుత్వ ఉద్యోగులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గుర్తుచేశారు. అధికారుల పనితీరు, ప్రవర్తన, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ సంస్థలపై ప్రజలకు ఉండే నమ్మకాన్ని నేరుగా ప్రభావితం చేస్తాయని చెప్పారు. "మనం ఏ స్థాయిలో, ఏ పని చేసినా ప్రజల నమ్మకాన్ని కాపాడాలి. అదే మన ప్రజాస్వామ్యానికి పునాది" అని శ్రీ మోదీ అన్నారు. సామర్థ్య నిర్మాణ కమిషన్‌ను మరోసారి అభినందిస్తూ.. 'వికసిత్ భారత్' దిశగా భారత్ సాగిస్తున్న ప్రయాణంలో ఈ 'కర్మయోగి సాధన సప్తాహం' ఒక ముఖ్యమైన అధ్యాయంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

# పదవులు పార్టీకి అలంకారప్రాయాలు..



అమరావతి, ఏప్రిల్ 3:పదవులు పార్టీకి అలంకాంప్రాయాలని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. గుంటూరు శ్రీసీతారామయ్య ట్రస్ట్ బోర్డు ఛైర్మన్, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం పాయకాపురం ప్రాంతం లోని కల్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొని ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ కోలా శ్రీను, డైరెక్టర్లు దేవరకొండ లక్ష్మణ్,రమణమ్మ ట్రస్ట్ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. టీడీపీ, కూటమి పార్టీ బలోపేతంకొరకు కష్ట పడిన ప్రతి ఒక్కరికి ఉన్నత పదవులు ఇచ్చి ప్రోత్సహించడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈకార్యక్రమంలో ఘంటా కృష్ణ మోహన్, నవణితం,లబ్బ వైకుంటం,బొమ్మదేవర రత్న కుమారి,పైడి శ్రీను,మోతుకురి ఖాసిమ్, ఆకుల సూర్యప్రకాష్,కంచేటి నాగరాజు, పసుపులేటి వీరాస్వామి,బుదాల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం..

అమరావతి, ఏప్రిల్ 3:మండల కేంద్రమైన కోసిగిలోని 3 వ వార్డు కు చెందిన వెంకట లక్ష్మి కంపాటి శ్రీనివాసులు దంపతుల మూడవ కుమారుడు కోసిగి బాలుర హైస్కూల్లో 9 వతరగతి చదువుతున్న కంపాటి నరసింహులు, ( 16) అనే విద్యార్థి కోసిగి మండలం సజ్జల గుడ్డం గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు బస్సు కిందపడి,అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం నాడు చోటు చేసుకునింది.

పోలీసులు సంఘటన వివరాలు పరిశీలిస్తే మృతుడు కంపాటి నరసింహులు, ప్రస్తుతం కోసిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుచుండగా,శుక్రవారంనాడు గుడ్ ఫ్రైడే సెలవు కారణంగా ఇంటి వద్ద ఉండినాడని, అతని పెదనాన్న కూతురు ఎంగేజ్‌మెంట్ కార్యక్రమం నిమిత్తం బంధువులను పిలవడానికి, ఉదయం సుమారు 9గంటలకు మృతుడు నరసింహులు మరియు అతని పెదనాన్న కొడుకు విజయ్ గోపాల్ కలిసి ఏపీ21ఏ ఎస్ 1571 నంబరు గల మోటార్ సైకిల్‌పై కోసిగి నుండి సజ్జలగుడ్డం గ్రామం వైపు బయలుదేరినారని తెలిపా రు. విజయ్ గోపాల్ మోటార్ సైకిల్ తొలుతుండగా, నరసింహులు వెనకాల కూర్చొని ఉండినాడని. సుమారు 9:30 గంటల సమయంలో కోసిగి ? సజ్జల గుడ్డం రహదారిలో, డి.సి. నారాయణ పొలం వద్ద నాగప్ప కట్ట సమీపంలో వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన ఏ పి 21జెడ్ 0456 నంబరు గల ఐరన్ గల్లు బస్సు డ్రైవర్ కురువ రామలింగ, అతివేగంగా, అజాగ్రత్తగా మరియు నిర్లక్ష్యంగా నడుపుతూ వీరికి ఎదురుగా వస్తున్నందున, బస్సు ఢీకొట్టే ప్రమాదం ఉందని భావించి మోటార్ సైకిల్ నడుపుతున్న విజయ్ గోపాల్ సడెన్ బ్రేక్ వేయడంతో వాహనం స్కిడ్ అయినదని తెలిపారు.

ఈ క్రమంలో విజయ్ గోపాల్ రోడ్డుకు ఎడమ వైపున పడగా, మృతుడు నరసింహులు రోడ్డుపై పడటంతో, బస్సు ఎడమ వైపు టైరు అతని శరీరంపై ఎక్కగా అతనికి తీవ్ర రక్తగాయాలు అయి అక్కడికక్కడే చనిపోవడం జరిగినదన్నారు. ఈ మేరకు మృతుని తండ్రి శ్రీనివాసులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించి నట్లు సిఐ మంజనాథ్, ఎస్సై రమేష్ రెడ్డి లు తెలిపారు.

# 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను క్యాప్టివ్, వాణిజ్య గనుల్లో రికార్డు స్థాయి ఉత్పత్తి, రవాణాను సాధించిన బొగ్గు మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:దేశ బొగ్గు రంగంలో 2025-26 ఆర్థిక సంవత్సరాన్ని ఒక చారిత్రాత్మక మైలురాయిగా బొగ్గు మంత్రిత్వ శాఖ అభివర్ణించింది. దేశ చరిత్రలో తొలిసారిగా క్యాప్టివ్, వాణిజ్య గనుల బ్లాకుల నుంచి మొత్తం ఉత్పత్తి, రవాణా కలిపి 200 మిలియన్ టన్నుల మార్కును అధిగమించాయి. దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో ఈ రంగానికి ఉన్న సామర్థ్యం, భాగస్వామ్యం ఈ వృద్ధితో స్పష్టమైంది.


మార్చి 31, 2026 నాటికి క్యాప్టివ్, వాణిజ్య గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి 210.46 మిలియన్ టన్నులకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన 190.95 మిలియన్ టన్నులతో పోలిస్తే, ఇది 10.22 శాతం పటిష్టమైన వృద్ధిని సూచిస్తుంది. బొగ్గు రవాణా కూడా గణనీయంగా పెరిగి 204.61 మిలియన్ టన్నులకు చేరుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలోని 190.42 మిలియన్ టన్నులతో పోలిస్తే ఇది 7.35 శాతం వృద్ధి నమోదు చేసింది. ఈ రికార్డు స్థాయి గణాంకాలు మెరుగైన కార్యకలాపాల సామర్థ్యం, పటిష్టమైన రవాణా వ్యవస్థ, దేశంలో పెరుగుతున్న ఇంధన డిమాండ్ తీర్చడంలో ఈ రంగం సాధించిన ప్రగతికి నిదర్శనం.

గత నాలుగేళ్లుగా బొగ్గు ఉత్పత్తి, రవాణా రెండింటిలోనూ స్థిరమైన, క్రమమైన పెరుగుదల ధోరణిని ఈ గ్రాఫ్ వివరిస్తుంది. రవాణాలో కనిపిస్తున్న ఈ నిరంతర వృద్ధి.. మరింత సమర్థవంతమైన రవాణా, క్రమబద్ధమైన తరలింపు, పటిష్టమైన బొగ్గు సరఫరా వ్యవస్థను స్పష్టం చేస్తోంది.

# ప్రజా దర్బార్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి..

### -మంత్రి ఎన్ఎండి ఫరూక్..

అమరావతి, ఏప్రిల్ 3: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి కుటుంబం తీవ్రంగా కృషి చేస్తుందని ఏదైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకోవస్తే వాటిని పరిష్కరిస్తానని రాష్ట్ర మైనార్టీ న్యాయశాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేదిక ద్వారా పలువు రు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మంత్రివర్యులు ఫరూక్ స్వయంగా అర్జీలను స్వీకరిం చారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటు వంటి జాప్యం ఉండకూడదన్నా రు. అధికారులు ప్రజలు కు అందు బాటులో ఉండాలని వారి కోసం సేవ చేయాలని సూచించా రు. ఇచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన తక్షణమే ఆయా సమస్య లకు సంబంధించిన శాఖ ల అధి కారులకు ఆదేశాలు జారీ చేశారు.



ప్రజలకు మెరుగైన సేవ లు అందించడానికి ప్రభుత్వం తర పున, తెలుగుదేశం పార్టీ తరపున నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి..



అమరావతి, ఏప్రిల్ 3: రాష్ట్రంలో రాజకీయవేడి రగులుకుంటుంది. ఇప్పటికే రాష్ట్రంలోని మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వార్డుల విభజన కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అధికారికంగా కూడా ప్రభుత్వం ఉత్తర్వులు ఎత్తింది. ఈ మేరకు నంద్యాల జిల్లాలో మున్సిపాలిటీలో పలు వార్డుల సంఖ్య పెరిగింది. దీంతో స్థానిక ఎన్నికలైనా సర్పంచు ఎంపీటీసీ, జడ్పిటిసి మున్సిపల్ ఎన్నికలకు సమాయుత్తమ అయ్యేందుకు నియోజకవర్గ ప్రజాప్రతినిధుల కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి శుక్రవారం ఆత్మీయ సమావేశం..దిశా నిర్దేశం చేశారు. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసిపోయింది. మున్సిపల్ చైర్మన్ ల కౌన్సిలర్ల పదవీకాలం ముగిసిపోయింది.

స్థానిక సంస్థల పదవీకాలం ముగిసిపోవడంతో కార్యకర్తలను ఎన్నికల సిద్ధం చేసేందుకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో, నంద్యాల మరియు గోస్పాడు మండలాలకు చెందిన ఎంపీపీలు, సర్పంచ్‌లు, వైస్ సర్పంచ్‌లు మరియు ఎంపీటీసీలతో భారీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మరియు మాజీ రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి పాల్గొని ప్రజాప్రతినిధులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా శిల్ప మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి ఒక్క ప్రజాప్రతినిధికి కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. రానున్న ఎన్నికలే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. వైసీపే నాయకత్వంలో అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, రాబోయే ఎన్నికల్లో పార్టీ అత్యధిక మెజారిటీతో మళ్ళీ అధికారాన్ని చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి,ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమన్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, మహేశ్వరరెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్,వైసీపీ జిల్లా కార్యదర్శి శివనాగిరెడ్డి, బసవేశ్వరరెడ్డి, ప్రహ్లాదరెడ్డి, సర్పంచులు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ఆత్మీయ సమావేశం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు.

# 75 సంవత్సరాల సంస్థాగత శ్రేష్ఠత్వానికి సూచికగా ఒక తపాలా బిళ్లను విడుదల చేసిన కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:సహారన్ పూర్ లోని పోస్టల్ ట్రయినింగ్ సెంటర్ (పీటీసీ) ప్లాటినమ్ జూబిలీ ఘట్టాన్ని తపాలా విభాగం నిర్వహించింది. శిక్షణనివ్వడంలో, సంస్థాగత సామర్థ్యాల్ని పెంపొందింపచేయడంలో 75 సంవత్సరాల శ్రేష్ఠత్వానికి గుర్తుగా ఒక స్మారక తపాలా బిళ్లను విడుదల చేశారు.

ఈ స్టాంపును కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా న్యూఢిల్లీ ఆకాశవాణి భవన్‌లోని రంగ్ భవన్ సభామందిరంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సర్వీసుల డైరెక్టర్ జనరల్ శ్రీ జితేంద్ర గుప్త, డీసీసీ మెంబర్ (ఫైనాన్స్) శ్రీ మనీష్ సిన్హా, సీజీసీఏ వందనా గుప్తా, సభ్యుడు (మానవ వనరుల అభివృద్ధి. .హెచ్ఆర్‌డీ) కల్నల్ ఎస్.ఎఫ్. హెచ్. రిజ్వీతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

(ఎడమ నుంచి కుడికి: సభ్యుడు (హెచ్ఆర్‌డీ) కల్నల్ ఎస్.ఎఫ్.హెచ్. రిజ్వీ, డైరెక్టర్ జనరల్ పోస్టల్ సర్వీసెస్ శ్రీ జితేంద్ర గుప్తా, శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా, డీసీసీలో సభ్యుడు (ఫైనాన్స్) శ్రీ మనీష్ సిన్హా, సీజీసీఏ వందన గుప్తా)


సభను ఉద్దేశించి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా ప్రసంగిస్తూ ఈ సందర్భాన్ని ఒక చరిత్రాత్మక ప్రగతి ప్రస్థానంగా వర్ణించారు. పోస్టల్ ట్రయినింగ్ సెంటర్ కేవలం ఒక సంస్థ కాదని, ఇది చరిత్రను శ్వాసిస్తూ, నిరంతరం మార్పులకు లోనవుతున్న స్థలమని ఆయన అన్నారు. 75 సంవత్సరాల వేడుకను జరుపుకోవడం దేశ నిర్మాణానికి పోస్టల్ ట్రయినింగ్ సెంటర్ చిరకాలంగా అందజేస్తున్న తోడ్పాటుకు అద్దం పడుతోందని ఆయన తెలిపారు.

భవిష్యత్తు పథకాలను మంత్రి వివరిస్తూ భారత్.. 2030 కల్లా ఒక్క మన దేశానికే కాకుండా ప్రపంచానికే ఆధునిక రవాణా వ్యవస్థలో ఓ కీలక దేశంగా మారే దిశగా పురోగమిస్తోందన్నారు. ఈ మహత్వకాంక్షను సాకారం చేయడంలో తపాలా విభాగం, ఆ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది కీలక పాత్రను పోషించారని ఆయన స్పష్టం చేశారు.

పోస్టల్ ట్రయినింగ్ సెంటర్, సహారన్‌పూర్‌ను 1951 ఏప్రిల్ 2న ఏర్పాటు చేశారు. తపాలా సిబ్బందికి ఒక నిర్దిష్ట, వృత్తి నైపుణ్యంతో కూడిన శిక్షణ వ్యవస్థను పరిచయం చేసి స్వతంత్ర భారతదేశంలో పరిపాలన ప్రణాళికను బలపరచాలన్న లక్ష్యంతో ఈ పీటీసీని స్థాపించారు. అంతవరకూ లాంఛనప్రాయంగా సాగిన కార్య ఆధారిత శిక్షణను, 56.71 ఎకరాల క్యాంపస్‌లో పద్ధతి ప్రకారం రూపొందించిన సంస్థాగత ప్రణాళిక సాయంతో అమలు చేయదల్చారు. గత కొన్నేళ్లలో ఈ సెంటర్ ఉత్తర భారతదేశంలో ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల తపాలా సిబ్బందికి సేవలను అందిస్తూ, ఒక ప్రతిష్ఠాత్మక శిక్షణ సంస్థగా పేరుతెచ్చుకొంది. ప్రస్తుతం దీనిలో 11 ఉన్నత స్థాయి కంప్యూటర్ ల్యాబొరేటరీలు, ఒక ఈ-స్టూడియో భాగమయ్యాయి. ఈ -కామర్స్ లాజిస్టిక్స్‌తో పాటు, డిజిటల్ మాధ్యమం ద్వారా ఏటా సుమారు 3,000 మంది ఉద్యోగులకు కార్యకలాపాల నిర్వహణ, ఆర్థిక సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకుపోవడంతో పాటు, క్రమశిక్షణ, విశ్వసనీయత, ప్రజాసేవా సంబంధిత కీలక విలువల్ని కూడా ఈ సెంటర్‌లో నేర్పిస్తున్నారు.

ఈ స్మారక తపాలా బిళ్లలను దేశ వ్యాప్తంగా తపాలా బిళ్లల బ్యూరోల్లో అందుబాటులో ఉంచారు.

# తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి దీప్తి దొడ్డి కొమురయ్య



**-యాదవ ఉద్యోగుల సంఘం, టీఎన్జీవో నాయకులు**

నల్గొండ, ఏప్రిల్ 3: దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమర వీరుడిగా నిలిచి, ఆయన త్యాగం ప్రజల్లో స్వేచ్ఛా భావాన్ని, సమానత్వం కోసం పోరాడే స్ఫూర్తిని నింపిందని, ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తుందని నల్లగొండ జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తరాల పరమేశ్ యాదవ్, టీఎన్జీఓస్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగెల్లి మురళి, జె.శేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 1946 జూలై 4న విసునూరు రామచంద్రారెడ్డి అల్లరి మూకల రౌడీలతో కలిసి సుమారు 40 మంది వచ్చి ప్రజలపై దాడులకు దిగిన ఘటనను గుర్తు చేశారు. ప్రజలతో కలిసి కర్రలు, బడిశెలు, గునపాలతో ప్రతిఘటించిన గుండాలను తరిమికొట్టే ప్రయత్నంలో దొడ్డి కొమురయ్య ముందుండి పోరాడినట్లు వివరించారు. ఈ క్రమంలో ఆయనపై కాల్పులు జరగడంతో అమరుడైనట్లు పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య మరణ వార్త జనగాం ప్రాంతంతో పాటు ఆంధ్ర మహాసభ కార్యకర్తలందరికీ విస్తరించి, దేశముఖ్, విసునూరు అధికారుల పీడనలకు వ్యతిరేకంగా ప్రజల్లో తిరుగుబాటు స్ఫూర్తిని రగిలించిందని చెప్పారు. నైజాంలు, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా జరిగిన ఈ పోరాటం ప్రజాస్వామ్య దిశగా తెలంగాణలో మార్గదర్శకంగా నిలిచిందని అన్నారు. దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి దీప్తిగా నిలిచి, రైతాంగంలో చైతన్యం నింపిందని తెలిపారు. ఆయన ఆశయాలు సామాజిక న్యాయం సాధనకు నేటికీ మార్గదర్శకంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సంజీవయ్య, వార్డెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రణదీవె, యాదవ్, ఉద్యోగుల సంఘం నాయకులు కడారి యాదయ్య, చింతకాయల రామచంద్రు, తరాల జగదీష్, అల్లి సతీష్, రాయనబోయిన రాంబాబు, బారి శ్రీనివాస్, టీఎన్జీవోస్ నాయకులు సత్యనారాయణ, సుమన్, కవిత, జ్యోతి పాల్గొన్నారు.

# శ్రీసీతారామయ్య ఫస్ట్ బోర్డు కమిటీ ప్రమాణ స్వీకారం

## -కమిటీచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

అమరావతి, ఏప్రిల్ 3: శ్రీ సీతారామయ్య ఫస్ట్ బోర్డు ఛైర్మన్, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం పాయకాపురం ప్రాంతంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొని ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ కోలా శ్రీను, డైరెక్టర్లు దేవరకొండ లక్ష్మణ్,రమణమ్మలచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఘంటా కృష్ణ మోహన్, నవణితం,బొమ్మదేవర రత్న కుమారి,పైడి శ్రీను,మోతుకూరి ఖాసిమ్,ఆకుల సూర్యప్రకాష్,కంచేటి నాగరాజు, పసుపులేటి వీరాస్వామి,బుదాల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా 4 లక్షలకు పైగా హాట్‌స్పాట్‌లతో పబ్లిక్ వై-ఫై విస్తరణను వేగవంతం చేస్తున్న పీఎం - వాణి పథకం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:దేశవ్యాప్తంగా బ్రాడ్‌బ్యాండ్ సేవలను వేగంగా విస్తరించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి వై-ఫై యాక్సెస్ నెట్‌వర్క్ ఇంటర్‌ఫేస్ (పీఎం-వాణి) పథకం ద్వారా ప్రభుత్వం పబ్లిక్ వై-ఫై సదుపాయాన్ని ప్రోత్సహిస్తోందని కేంద్ర కమ్యూనికేషన్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా తెలిపారు.

ఫిబ్రవరి 28, 2026 నాటికి, దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పీఎం - వాణి పథకం కింద మొత్తం 4,09,403 పబ్లిక్ డేటా ఆఫీసులు (పీడీఓలు) / పబ్లిక్ వై-ఫై హాట్‌స్పాట్‌లు అందుబాటులోకి వచ్చాయనీ, ఈ పథకం కింద 207 పబ్లిక్ డేటా ఆఫీస్ అగ్రిగేటర్లు (పీడీఓఏలు), 113 యాప్ ప్రొవైడర్లు నమోదయ్యారని శ్రీ సింధియా ఈ రోజు రాజ్యసభలో ఒక లిఖిత పూర్వక సమాధానంలో తెలియజేశారు. పీఎం-వాణి పథకం కింద పబ్లిక్ డేటా ఆఫీసులు, అగ్రిగేటర్లు, యాప్ ప్రొవైడర్ల వివరాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వారీగా నమోదు చేస్తున్నారు. వై-ఫై హాట్‌స్పాట్‌ల ఏర్పాటులో ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయి.

ఫిబ్రవరి 28, 2026 నాటికి పీఎం-వాణి హాట్‌స్పాట్‌లను ఉపయోగించిన మొత్తం ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 2,44,67,896 కి చేరిందని, ఇది దేశంలో పబ్లిక్ వై-ఫై సేవల పట్ల పెరుగుతున్న ఆదరణకు సంకేతమని కేంద్ర మంత్రి తెలిపారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి పీఎం-వాణి హాట్‌స్పాట్ల ద్వారా సుమారు 58.64 పెటాబైట్ల డేటా వినియోగం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

పీఎం-వాణి చట్రం వికేంద్రీకృత, మార్కెట్ ఆధారిత నమూనాపై పనిచేస్తుంది. ఇది సాంకేతిక, వాణిజ్య సాధ్యతలను బట్టి వై-ఫై హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేయడానికి, నిర్వహించడానికి స్థానిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తుంది. ప్రధానంగా విధానపరమైన వెసులుబాటు కల్పించడమే ఇందులో ప్రభుత్వం పాత్ర.

గ్రామీణ, మారుమూల ప్రాంతాలలో పీఎం-వాణి హాట్‌స్పాట్‌ల వృద్ధిని మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం కొన్ని కీలక విధానపరమైన చర్యలను ప్రవేశపెట్టింది.

ఖర్చు తగ్గించే చర్యలు: పబ్లిక్ డేటా ఆఫీసులకు ఫైబర్- టు-ది-హోమ్ (ఎఫ్టీటీహెచ్) కనెక్షన్లను ఉపయోగించి సేవలు అందించేందుకు అనుమతి ఇచ్చారు. అలాగే, అనేక యాక్సెస్ పాయింట్లను ఒకే బ్యాక్‌హాల్ ద్వారా ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్‌కు కలిపే విధంగా నమీకరించుకునే అవకాశం కల్పించారు.

ఆదాయ పెంపు అవకాశాలు: టెలికాం సర్వీస్ ప్రొవైడర్లకు మొబైల్ డేటా ఆఫ్‌లోడింగ్ సేవలు అందించేందుకు పబ్లిక్ డేటా ఆఫీసులకు అనుమతి ఇచ్చారు. వినియోగదారుల సమ్మతితో వారికి ప్రచార, బ్రాండెడ్ కంటెంట్ అందించడానికి పిడిఓఏలు, యాప్ ప్రొవైడర్లకు కూడా అనుమతి లభించింది.

మెరుగైన వినియోగదారు అనుభవం: ప్రస్తుతం ఉన్న ఇళ్లు, వ్యాపార సంస్థల వై-ఫై నెట్‌వర్క్లను పీఎం-వాణి వ్యవస్థలో అనుసంధానించవచ్చు. దీనికి తోడు, పిడిఓఏలు తమలో తాము రోమింగ్ సౌకర్యం కల్పించుకునేలా వీలు కల్పించారు. దీని వల్ల వినియోగదారులు వేర్వేరు పీఎం-వాణి హాట్‌స్పాట్‌ల పరిధిలో ఉన్నప్పటికీ ఎటువంటి అంతరాయం లేకుండా ఇంటర్నెట్‌ను వాడుకోవచ్చు. భారత టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ (ట్రాయ్) 16. 06.2025న జారీ చేసిన టారిఫ్ ఆర్డర్ ద్వారా మరో కీలక మార్పు చేసింది. ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు తమ రిటైల్ ఎఫ్టీటీహెచ్ బ్రాడ్ బ్యాండ్ ప్లాన్‌లను (200 ఎంబీపీ ఎస్ వరకు) పబ్లిక్ డేటా ఆఫీసు లకు అందించాలని ఆదేశించింది.

# జన విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు- 2026కు లోక్‌సభ, రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:దేశంలో సులభతర వాణిజ్యాన్నీ, జీవన సౌలభ్యాన్నీ మరింత మెరుగుపరిచే దిశగా కీలక ముందడుగు పడింది. జనవిశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు - 2026కు లోక్‌సభ, రాజ్యసభలు ఆమోదం తెలిపాయి.

విశ్వాసమే ప్రాతిపదికగా పాలన యంత్రాంగాన్ని మరింత మెరుగుపరిచేందుకూ, తగిన నియంత్రణలను అమలు చేసేందుకూ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ బిల్లు స్పష్టం చేస్తోంది. చిన్నపాటి తప్పిదాలను నేరాలుగా పరిగణించకపోవడం, ప్రస్తుతమున్న చట్టపరమైన నిబంధనలను హేతుబద్ధీకరించడం ద్వారా.. వ్యక్తులు, వ్యాపార సంస్థలపై పాటించాల్సిన నిబంధనల భారాన్ని తగ్గించడం ఈ బిల్లు ముఖ్యోద్దేశం.

ఈ బిల్లులోని నిబంధనల ప్రకారం.. 23 మంత్రిత్వ శాఖల పరిధిలోని 79 కేంద్ర చట్టాలకు సంబంధించి మొత్తం 784 నిబంధనలను సవరించారు. వీటిలో వాణిజ్య సౌలభ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా.. గతంలో చిన్న తప్పిదాలనే నేరాలుగా భావించే 717 నిబంధనల స్వభావాన్ని మార్చారు. ఇకపై వాటిని నేరాలుగా పరిగణించబోరు. అలాగే మరో 67 నిబంధనలను సవరించి జీవన సౌలభ్యాన్ని మెరుగుపరిచారు.

మొత్తంగా చూస్తే, చిన్న తప్పిదాలనే నేరాలుగా పరిగణిస్తున్న వెయ్యికి పైగా నిబంధనలను హేతుబద్ధీకరించాలని ఈ బిల్లు లక్ష్యంగా పెట్టుకుంది. చిన్నపాటి ఉల్లంఘనలను నేరాల జాబితా నుంచి తొలగించడం, తద్వారా దేశంలోని నియంత్రణ వాతావరణాన్ని మెరుగుపరచడమే కాకుండా.. వ్యాపార సంస్థలకూ, పౌరులకూ మరింత అనుకూలమైన వ్యవస్థను అందుబాటులోకి తేవడానికి ఇది దోహదపడుతుంది.

మొదట 2025 ఆగస్టు 18న 'జనవిశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు- 2025' పేరిట లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లు 10 మంత్రిత్వ శాఖలు/విభాగాల పరిధిలోని 16 కేంద్ర చట్టాలలోని 355 నిబంధనలకు సవరణలను ప్రతిపాదించింది. అనంతరం లోక్‌సభ.. ఎంపిక కమిటీకి ఈ బిల్లును సిఫార్సు చేసింది. శ్రీ తేజస్వి సూర్య అధ్యక్షతన ఈ కమిటీ 49 సమావేశాలు నిర్వహించి, 2026 మార్చి 13న తన నివేదికను సమర్పించింది. సంబంధిత భాగస్వామ్య పక్షాలన్నింటితో ఈ కమిటీ విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించింది. పరిశీలనలో ఉన్న నిబంధనలతోపాటు.. అవే చట్టాల్లోని మరిన్ని నిబంధనలనూ సమీక్షించింది. మరో 62 కేంద్ర చట్టాల్లో.. చిన్నపాటి ఉల్లంఘనలను కూడా నేరాలుగా పరిగణించేలా ఉన్న నిబంధనలను సవరించాలని సిఫార్సు చేసింది.

# దొంగతనాలకు పాల్పడిన నిందితుడు అరెస్ట్..




అమరావతి, ఏప్రిల్ 3:జిల్లాలో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.15 లక్షల విలువైన బంగారు, వెండి నగలతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ తెలిపారు.

గత ఏడాది నుంచి నంద్యాల జిల్లాలోని నంద్యాల తాలూకా, బండిఆత్మకూరు, రేవనూరు, నంజావుల, గడివేముల, బేతంచర్ల, అవుకు తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో జరుగుతున్న దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం. జావళి ఆల్ఫోన్స్ ఆధ్వర్యంలో తాలూకా ఇన్‌స్పెక్టర్ ఈశ్వరయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ పర్యవేక్షణలో చర్యలు చేపట్టారు.

శుక్రవారం పట్టణ శివారులోని నందమూరి నగర్ రోడ్, నాగులకట్ట సమీపంలోని టీ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, నంబర్ ప్లేట్ లేని పల్సర్ మోటార్ సైకిల్‌పై వస్తున్న వ్యక్తి పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు.

విచారణలో అతను వైఎస్సార్ నగర్‌కు చెందిన షేక్ బాబావలి అని గుర్తించారు. అతను పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతూ తిరుగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి సుమారు రూ.15 లక్షల విలువైన బంగారు, వెండి నగలు మరియు రూ.50,500 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన పోలీసు సిబ్బంది రవికుమార్, గంగాధర్, ఇబ్రహీం, మలిక్ బాషా, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, గంగారం, కృష్ణమ నాయుడులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# దొడ్డి కొమురయ్య ఆశయాల సాధన అందరి బాధ్యత



నల్గొండ, ఏప్రిల్ 3: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పలువురు నాయకులు, దొడ్డి కొమురయ్య విగ్రహ కమిటీ సభ్యులు అన్నారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా బీబీనగర్ మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహ కమిటీ అధ్యక్షుడు సోము రమేశ్ కురుమ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం పాలనలో రైతులు అనుభవించిన అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు. రైతాంగ హక్కుల కోసం ఆయన చేసిన త్యాగం తెలంగాణ చరిత్ర లో చిరస్థాయిగా నిలిచిందన్నారు .తెలంగాణ పర్యాటకం1946 జూలై 4న కడవెండి గ్రామంలో జరిగిన రైతాంగ పోరాటంలో పాల్గొంటూ అమరుడైన దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిందని తెలిపారు. ఆయన చూపిన ధైర్యం, త్యాగం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువత దొడ్డి కొమురయ్య ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఏర్పడిన శ్రీ బీరప్ప దేవాలయ కమిటీ అధ్యక్షుడు బండారి బాలయ్యను సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోలి పింగల్ రెడ్డి, యర్కల సుధాకర్ గౌడ్, బొక్క జైపాల్ రెడ్డి, రాచమల్ల శ్రీనివాసులు, చింతల సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ గోలి నర్సింహారెడ్డి, మంచాల రవికుమార్, విగ్రహ కమిటీ సభ్యులు జాన సత్యనారాయణ, సోమ ముత్యాలు, కురుమ సంఘం అధ్యక్షుడు బండారి బాలయ్య, సభ్యులు మంగ లింగేశ్, బండ శంకర్, సోము సురేశ్, దావడి రాజు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్..ఆరుగురు విద్యార్థులకు అస్వస్థత

ఆసిఫాబాద్, ఏప్రిల్ 3:: జిల్లాలోని పెంచికల్ పేట్ మండలం ఎల్లూరు ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రాత్రి భోజనం చేశాక అర్ధరాత్రి మరోసారి భోజనం చేసిన విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగిందని అధికారులు వివరించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను కాగజ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందజేస్తున్నారు.

# రక్షణశాఖ మంత్రి నేతృత్వంలో పశ్చిమాసియాపై న్యూఢిల్లీలో ఐజీఓఎమ్ రెండో సమావేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఏప్రిల్ 2న న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్-2లో అనధికారిక మంత్రుల బృందం (ఐజీఓఎం) రెండో సమావేశం జరిగింది. పశ్చిమ ఆసియాలో చోటచేసుకుంటున్న పరిస్థితులను పర్యవేక్షించడానికి, భారత్‌పై వాటి ప్రభావం తక్కువగా ఉండేలా ముందస్తు చర్యలను చేపట్టేందుకి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇటీవలి పరిణామాలపై మంత్రుల బృందం సుదీర్ఘంగా చర్చించింది. ప్రస్తుతం కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా తలెత్తే ఎలాంటి ప్రతికూల ప్రభావాలనైనా తగ్గించడానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపైనా చర్చలు జరిపారు.

ఈ సమావేశంలో ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మల సీతారామన్, పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరి, విద్యుత్ శాఖ మంత్రి శ్రీ మనోహర్ లాల్ ఖట్టర్, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జేపీ నడ్డా, విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి, శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్, రైల్వే, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్, ఐటీ శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ పాల్గొన్నారు.

'అనిశ్చిత పరిస్థితి' దృష్ట్యా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాల్సిన ప్రాముఖ్యతను, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి తగిన రీతిలో స్పందించాల్సిన అవసరాన్ని రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. ఈ సంఘర్షణ ప్రభావం దేశ ప్రజలపై తక్కువగా ఉండేలా చూడటం కోసం ఏ ఒక్క అవకాశాన్ని వదలకుండా అన్ని విధాలా కృషి చేయాలని తెలిపారు.

ఈ సమావేశం సందర్భంగా పరిస్థితిని ఎదుర్కోవడానికి తీసుకుంటున్న చర్యల గురించి ఏడుగురు కార్యదర్శులతో కూడిన సాధికారిక బృందాలు.. మంత్రుల బృందానికి వివరించాయి. ప్రపంచ వాణిజ్య అంతరాయాల వల్ల తలెత్తిన ఆందోళనలను పరిష్కరించడానికి, పరిశ్రమలకు.. ముఖ్యంగా తయారీ రంగానికి ఉపశమనం, మద్దతు అందించడానికి, అలాగే పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంపొందించడానికి ఆర్థిక మంత్రిత్వ శాఖ చేపట్టిన చర్యల గురించి కూడా వివరించారు. ఆ చర్యలు కింది విధంగా ఉన్నాయి.

40 రకాల కీలక పెట్రోకెమికల్ ఉత్పత్తులపై 2026 జూన్ 30 వరకు పూర్తి కస్టమ్స్ సుంకం మినహాయింపును ఇస్తూ 2026 ఏప్రిల్ 1న నోటిఫికేషన్ విడుదల చేశారు.

సెజ్‌లలోని అర్హత కలిగిన యూనిట్లు తాము ఉత్పత్తి చేసిన వస్తువులను దేశీయ పన్ను విధించే ప్రాంతంలో రాయితీ కస్టమ్స్ సుంకం ధరలతో విక్రయించుకోవడానికి వీలుగా 2026 ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు అమలులో ఉండేలా ఒక ప్రత్యేక ఏకకాల ఉపశమన చర్యను ప్రకటించారు.

2017 ఏప్రిల్ 1 కంటే ముందు చేసిన పెట్టుబడుల విషయంలో గార్ (జీఏఏఆర్) నిబంధనలను వర్తింపజేయబోమని స్పష్టం చేస్తూ రెవెన్యూ శాఖ 2026 మార్చి 31న నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఈ చర్యలు టెక్స్‌టైల్స్, ప్యాకేజింగ్, ఫార్మాస్యూటికల్స్ వంటి డౌన్‌స్ట్రీమ్ రంగాలపై వ్యయ ఒత్తిడిని తగ్గిస్తాయి. దేశంలో సరఫరా స్థిరత్వాన్ని సులభతరం చేస్తాయి. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్న పెట్టుబడిదారులకు అవసరమైన స్పష్టతను అందిస్తాయి.

ఏప్రిల్ 1, 2026 నుంచి దేశీయ కార్యకలాపాల కోసం విమాన టర్బైన్ ఇంధనం ధరల నెలవారీ పెరుగుదలపై 25 శాతం పరిమితిని విధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. ఈ చర్య విమాన ప్రయాణ ఛార్జీల ఆకస్మిక పెరుగుదల నుంచి ప్రజలను రక్షించడంలో సహాయపడుతుందని ఆయన అన్నారు.

దేశీయ ఎల్‌పీజీ సరఫరాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, వినియోగ అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చడానికి రిఫైనరీ ఉత్పత్తిని పెంచామని తెలిపారు. ఎల్‌పీజీ పంపిణీ కేంద్రాలలో నిల్వలు అయిపోయినట్లు ఎటువంటి నివేదికలు లేవని, గృహ అవసరాల ఎల్‌పీజీ సిలిండర్ల డెలివరీ సాధారణ షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతోందని మంత్రుల బృందానికి సమాచారం అందించారు. కొన్ని ప్రాంతాలలో అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి ఘటనల కారణంగా తాత్కాలిక సరఫరా ఆందోళనలు తలెత్తాయని, ఇది ప్రజల్లో భయాందోళనలకు దారితీసిందని పేర్కొన్నారు.

ఎల్‌పీజీ నిల్వ, అక్రమ రవాణాను అరికట్టడానికి కఠినమైన చర్యలు తీసుకుంటున్నామని, పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తున్నామని మంత్రులకు వివరించారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన కొందరు ఎల్‌పీజీ పంపిణీ దారులపై కూడా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

వలస కార్మికులకు, తక్కువ వినియోగం ఉన్న కుటుంబాలకు మద్దతుగా 5 కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పీజీ సిలిండర్లు తగినంత అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2026 మార్చి 23 నుంచి ఇప్పటివరకు ఇటువంటివి 4.3 లక్షలకు పైగా సిలిండర్లు అమ్ముడయ్యాయి. డిమాండు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

వాణిజ్య ఎల్‌పీజీపై ఆధారపడే పారిశ్రామిక అవసరాలను తీరుస్తున్నట్లు మంత్రుల బృందానికి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. పారిశ్రామిక కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగేలా చూడటం కోసం సంక్షోభానికి ముందు ఉన్న సరఫరా స్థాయిలలో 80 శాతానికిపైగా ఎక్కువ మొత్తాన్ని ప్రస్తుతం కొనసాగిస్తున్నారని తెలిపారు. వివిధ పరిశ్రమల డిమాండును అర్థం చేసుకుని, వారి అవసరాలను తీర్చడానికి సంబంధిత మంత్రిత్వ శాఖలు, భాగస్వాములతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఆటో ఎల్‌పీజీ సరఫరా నిరంతరాయంగా జరిగేలా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు చూస్తున్నాయని.. అయితే ప్రైవేట్ ఆపరేటర్లు తమ సేకరణ సవాళ్ల కారణంగా కొన్ని సరఫరా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందుకే ప్రభుత్వ రంగ ఆటో ఎల్‌పీజీ పంపుల వద్ద రద్దీ కనిపిస్తున్నాయని, ఎక్కడైతే ఆటోలు డ్యూయల్ ఫీడ్ (పెట్రోలు, గ్యాస్ రెండింటితో నడిచేవి) కలిగి ఉన్నాయో, అక్కడ పెట్రోల్‌ను ఉపయోగించాల్సిందిగా వారిని ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు.

భయాందోళనతో ప్రజలు అధికంగా కొనుగోళ్లు చేయడం కారణంగా పెరిగిన డిమాండును తట్టుకోవడానికి, వినియోగదారులకు ఎటువంటి కొరత లేకుండా చూడటానికి, రోజువారీ ఎల్‌పీజీ సరఫరాల సంఖ్యను గణనీయంగా పెంచినట్లు మంత్రులకు వివరించారు. ఎక్కడైతే సాధ్యమవుతుందో అక్కడ పారిశ్రామిక వినియోగం కోసం నమ్మకమైన ప్రత్యామ్నాయంగా పైపుల ద్వారా సరఫరా అయ్యే సహజ వాయువును (పీఎన్‌జీ) ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పీఎన్‌జీ వాడుతున్న రంగాల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగేలా సరఫరాను అందిస్తున్నట్లు చెప్పారు.

కొందరు దుండగులు ఫోటోషాప్ చేసిన, మార్ఫింగ్ చేసిన చిత్రాలను, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ కావాలని భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రుల బృందానికి కేంద్ర రక్షణ మంత్రి వివరించారు. ఇటువంటి చర్యలను నిశితంగా పర్యవేక్షిస్తున్నారని, ధ్రువీకరణ లేని సమాచారాన్ని నమ్మవద్దని, షేర్ చేయవద్దని సూచించారు. ఖచ్చితమైన సమాచారం కోసం అధికారిక వనరులపై మాత్రమే ఆధారపడాలని పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు.

మంత్రుల బృందం తొలి సమావేశం 2026మార్చి 28న జరిగింది. ఆ సమయంలో రక్షణశాఖ మంత్రి అధికారులను ఉద్దేశిస్తూ.. పరిస్థితులను నిశితంగా పర్యవేక్షించాలని, మధ్యకాలిక నుంచి దీర్ఘకాలిక సన్నద్ధత విధానాన్ని అనుసరించాలని తెలిపారు. ఉన్నత స్థాయి సమన్వయాన్ని కొనసాగించాలని, వేగవంతమైన నిర్ణయాలు తీసుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# ఉరుసు రంగ సముద్రం బండ్‌కు శంకుస్థాపన

హైదరాబాద్, ఏప్రిల్ 3: గ్రేటర్ వరంగల్ ఉరుసు రంగసముద్రం బండ్ కు రాష్ట్ర దేవాదాయ అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ, మేయర్ గుండు సుధారాణి,జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హనంకొండ కలెక్టర్ బల్దియా ఇన్చార్జి కమిషనర్ చాహేత్ బాజ్పేయితో కలిసి శంకుస్థాపన చేశారు.

అమృత్ 2.0 పథకం కింద పబ్లిక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో సుమారు రూ. 3.14 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నగరంలోని 40 వ డివిజన్ ఉర్సుగుట్టలోని రంగ సముద్రం చెరువుపునర్జీవనం కల్పించే పనులనురాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖశుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక 40డివిజన్,కార్పొరేటర్ మరుపల్ల రవి, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చేంగల్ లో భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

బప్రజలందరిలో వసుధైక కుటుంబం అనే భావన వెల్లివిరియాలని ప్రపంచమంతటా శాంతి నెలకొనాలని పాస్టర్ లు అన్నారు. భీమ్‌గల్ మండలం చేంగల్ కర్మేల్ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ లు మాట్లాడుతూ,దైవ కుమారుడైనప్పటికీ క్రీస్తు ప్రభువు ఎన్నో కష్టాలతో బాధింపబడి జనుల రక్షణ కోసం ప్రాణాలర్పించి , క్షమాపణ పంచి త్యాగము చేసిన వ్యక్తి ఏసుప్రభు అని అన్నారు.

బడుగు బలహీన కుటుంబాలకు వెలుగులు నింపి అందరికీ పరలోక దీవెనలు పంచిన దైవ కుమారుడు లోక రక్షకుడు అని తెలియజేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు వర్తింప చేయాలని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పెద్ద మనసుతో తమ తీర్పును పునః సమీక్షించుకోవాలని కోరారు. ఏసుప్రభు 33 ఏళ్లకే సర్వమానవాళి కోసం లోకం విడిచిన రోజంటూ పాస్టర్‌లు అనంతరావు, దేవిడ్ రాజ్‌లు సందేశాలను వినిపించారు.

ఏసుప్రభువును శిలువకు వేయబడిన రోజని తెలియజేశారు. క్రీస్తు చూపిన మార్గం శాంతి కి, ప్రేమకు త్యాగానికి ప్రతిరూపం మండలంలోని వివిధ గ్రామాల నుంచి క్రైస్తవులు హాజరై భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ, దినమంతా చర్చిలోనే గడిపారు. ఉపవాస దీక్షలు పాటించారు.

# ఉట్నూర్ ఏజెన్సీలో సబ్ కలెక్టర్ల క్షేత్ర పర్యటన

ఆదిలాబాద్, ఏప్రిల్ 3:అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏజెన్సీలో రెండు రోజుల క్షేత్ర పర్యటన కోసం శుక్రవారం 20 మంది సబ్ కలెక్టర్ల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఐటిడిఏ కార్యాలయంలో ఐటిడిఏ పి.ఓ యువరాజ్ మర్మాట్‌తో ముఖాముఖి సమావేశమై గిరిజనులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, సేవల వివరాలను తెలుసుకున్నారు.

అనంతరం బృందం ఉద్యానవన శాఖ నర్సరీ, ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి, గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించింది. అక్కడ విద్య, భోజన వసతి, వైద్య సేవలు తదితర అంశాలను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకుంది. ఏజెన్సీలో గిరిజనులకు అందుతున్న సంక్షేమ పథకాలు, సేవలపై సమగ్రంగా అవగాహన పొందింది.

ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పి.ఓ యువరాజ్ మర్మాట్, ఉద్యానవన శాఖ అధికారి, జిసిసి డీఎం గుడిమల్ల సందీప్ కుమార్, ఐటిడిఏ పీవీటీజీ ఏపీవో ఆత్రం భాస్కర్, ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ ఉపేందర్ జాదవ్, అధికారులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలి : ఎస్పీ నరసింహ




నల్గొండ, ఏప్రిల్ 3: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి భరోసా కల్పించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ సిబ్బందికి సూచించారు. సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డ్స్, ఫిర్యాదుల నిర్వహణ, కమాండెంట్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలపై సమాచారం అందిన వెంటనే వేగంగా స్పందిస్తూ బాధితుల వద్ద నుండి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సామాజిక కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు.

పోలీస్ సిబ్బంది జట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి ఆపరేషన్ రోప్ సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతలో భాగంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐలు ఏడుకొండలు, ఐలయ్య, మహేందర్‌నాథ్, పాల్గొన్నారు.

# 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ. 38,424 కోట్లకు చేరుకున్న రక్షణ ఎగుమతులు: గతేడాదితో పోలిస్తే 62.66 శాతం మేర పెరుగుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:ఆర్థిక సంవత్సరం 2025-26లో రక్షణ ఎగుమతులు రూ. 38,424 కోట్ల జీవన కాల గరిష్ఠ స్థాయిని చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సర గణాంకాలు రూ. 23,622 కోట్లతో పోలిస్తే రూ. 14,802 కోట్లు (62.66 శాతం) భారీ పెరుగుదలను సూచిస్తోంది. ఈ చరిత్రాత్మక విజయంలో ప్రభుత్వ రంగ రక్షణ సంస్థలు (డీపీఎస్‌యూలు), ప్రైవేటు రంగం వరుసగా 54.84 శాతం, 45.16 శాతం మేర సహకారం అందించాయి. రక్షణ ఎగుమతులు చేస్తున్న అగ్రశ్రేణి దేశాల సరసన భారత్‌ను చేర్చాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ లక్ష్యానికి అనుగుణంగా భారత రక్షణ పరిశ్రమ ఈ విజయాన్ని సాధించింది.

రక్షణ ఉత్పత్తి విభాగం, భారతీయ రక్షణ ఉత్పత్తుల ఎగుమతిదారులు, ఇతర భాగస్వాముల పనితీరును రక్షణ మంత్రి శ్రీ రాజనాథ్ సింగ్ ప్రశంసించారు. రక్షణ పరికరాల తయారీలో ప్రపంచ కేంద్రంగా మారే దిశగా భారత్ ప్రయాణిస్తోందని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి మోదీ స్ఫూర్తిదాయక నాయకత్వంలో రక్షణ ఎగుమతుల్లో విజయగాథను భారత్ లిఖిస్తోందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో రక్షణ మంత్రి పేర్కొన్నారు.

గతేడాదితో పోలిస్తే డీపీఎస్‌యూల ఎగుమతులు 151 శాతం మేర పెరిగాయి. 14 శాతం పెరుగుదలను నమోదు చేస్తూ ప్రైవేటు సంస్థలు తమ ఉనికిని చాటుకున్నాయి. వాటా విలువ పరంగా చూస్తే ప్రైవేటు రంగం రూ.17,353 కోట్ల ఎగుమతులు చేయగా, డీపీఎస్‌యూలు రూ. 21,071 కోట్లు అందించాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఈ గణాంకాలు వరుసగా రూ. 15,233 కోట్లు, రూ. 8,389 కోట్లుగా ఉన్నాయి.

గత అయిదేళ్లలో మూడు రెట్లు పెరుగుదలను ఈ రికార్డు స్థాయి గణాంకాలు సూచిస్తున్నాయి.

భారత్‌లో తయారైన రక్షణ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండును, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో ఈ రంగానికి పెరుగుతున్న వాటాను ఈ గణనీయమైన పెరుగుదల సూచిస్తోంది. వ్యవస్థలు/ఉప వ్యవస్థల విషయంలో విజయవంతమైన అంతర్జాతీయ భాగస్వామిగా ఉండటంతో పాటు 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి 80కి పైగా దేశాలకు రక్షణ పరికరాలను భారత్ ఎగుమతి చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. ఎగుమతిదారుల సంఖ్య 128 నుంచి 145కు పెరిగింది. ఈ పెరుగుదల 13.3 శాతంగా ఉంది.

పనితీరు ఆధారంగా, ప్రపంచ స్థాయిలో పోటీపడేలా రక్షణ రంగంలో వ్యాపార సౌలభ్యాన్ని, రక్షణ ఎగుమతిదారులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరాయంగా కృషి చేస్తోంది. ఈ వృద్ధిమార్గంలో రక్షణ ఎగుమతిదారులకు తోడ్పాటు అందించడానికి పునర్వ్యవస్థీకరించిన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రక్షణ ఎగుమతుల నియంత్రణ ప్రక్రియలను రక్షణ ఉత్పత్తుల విభాగం క్రమబద్ధీకరించింది. ధ్రువీకరణల కోసం నిర్దేశిత కార్యకలాపాల విధానాన్ని సరళీకరించింది.

# బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం : మాజీ మంత్రి హరీష్‌రావు



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 3: బీసీలకు ,కుర్వ, గొల్ల, కురుమలకు రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలో కొమురయ్య విగ్రహానికి మాజీ మంత్రులు హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్ , లక్ష్మారెడ్డి , ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు నివాళులు అర్పించారు.తెలంగాణ పర్యాటకం

ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ బీసీలకు వేల కోట్ల బడ్జెట్ ఇస్తామని కేవలం రూ. 7 కోట్ల మాత్రమే నిధులు ఖర్చు చేసినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. శాసన సభలో రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీసినట్టు వెల్లడించారు. యాదవులకు గొర్లు ఇస్తామని, నగదు బదిలీ పథకం అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని తెలిపారు. కనీసం మంత్రి వర్గంలో అవకాశం కల్పించలేదని చెప్పారు.

దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ కేసీఆర్‌ను కోరితే వెంటనే అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ పచ్చబడాలని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు హరీష్ రావు అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. గతంలో 14 రోజులకు ఒకసారి నీళ్లు రాగా బీఆర్ఎస్ హయాంలో ప్రతి రోజు నీళ్లు ఇచ్చామని వివరించారు.

రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేమని, సాగు నీరు అందించేందుకు పూర్తి ప్రయత్నాలు చేసామని తెలిపారు. పాలమూరు ప్రాజెక్ట్ 90 శాతం పూర్తి చేశామని వెల్లడించారు. రాజకీయంగా బీసీలకు సమాన అవకాశాలు కల్పించాలని, బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశారని తెలిపారు .విద్య,ఉద్యోగాల్లో కూడా రిసర్వేషన్ ఇవ్వడం లేదని ఆరోపించారు.

# యువకుడి గొంతు కోసిన భర్త

ఖమ్మం ఏప్రిల్ 3: ఖమ్మం జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి గొంతు కోసిన ఘటన కలకలం రేపింది.

తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం రూరల్ మండలంలోని గోళ్లపాడు గ్రామానికి చెందిన ముక్కా మునేష్ ఈ దాడికి పాల్పడ్డట్లు సమాచారం. గురువారం తల్లంపాడు వద్ద ఉన్న ఓ వెంచర్‌కు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఆరెకోడు క్రాస్ రోడ్ సమీపంలో ఈ ఘటన జరిగింది.

ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ నంపేట శివ తీవ్రంగా గాయపడ్డాడు. అయితే గాయాల మధ్యలోనే అక్కడి నుంచి తప్పించుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన అనంతరం నిందితుడు మునేష్ పరారీలోకి వెళ్లిపోయాడు. బాధితుడు శివ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# విష వాయువులు పీల్చడంతో.. 26 మంది విద్యార్థులకు అస్వస్థత

లక్నో, ఏప్రిల్ 3 విష వాయువులు పీల్చడంతో 26 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.

శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థులను ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించారు. ఉత్తరప్రదేశ్‌లోని కుషినగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. తమ్‌కుహిరాజ్ తహసీల్ ప్రాంతంలోని గ్రీన్‌ల్యాండ్ పబ్లిక్ స్కూల్ సమీపంలో చెత్తను కాల్చారు. వ్యర్థాలు మండటంతో విష వాయువులు వెలువడ్డాయి. ఆ స్కూల్ ప్రాంగణంలోకి అవి వ్యాపించాయి.

# కారులో తరలిస్తుండగా రోడ్డుప్రమాదం

నల్గొండ, ఏప్రిల్ 3:కడెం మండలంలోని మాసాయిపేట గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. సర్పంచ్ దుర్గం లహరిక పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, చికిత్స పొందుతూ మృతి చెందింది.

మాసాయిపేట గ్రామ సర్పంచ్ దుర్గం లహరిక గుర్తు తెలియని పురుగుమందు తాగినట్లు సమాచారం. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కారులో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు.

# టీటీడీకి మినీ ట్రక్ విరాళంగా అందజేత



తిరుపతి, ఏప్రిల్ 3:తిరుమల దేవస్థానానికి అశోక్ లేల్యాండ్ సంస్థ శుక్రవారం టీటీడీకి రూ. 8.75 లక్షలు విలువైన దోస్త్ ప్లస్ ఎక్సెల్ మినీ ట్రక్ ను విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ఏరియా మేనేజర్ మహ్మద్ నజీరుద్దిన్ శ్రీవారి ఆలయం ఎదుట వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరికి వాహనం తాళాలను అందజేశారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 31 కంపార్టుమెంట్లు నిండి పోయాయి . టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. గురువారం స్వామి వారిని 62,642 మంది భక్తులు దర్శించుకోగా 23,887 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల రూ.4.18 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

# ఆమోదించిన ఆధార్ కేంద్రాలను మేపుల్స్ యాప్‌లో ప్రదర్శించడానికి మ్యాప్‌మై ఇండియాతో యూఐడీఏఐ ఒప్పందం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:మ్యాప్‌మై ఇండియాతో ఒక ఒప్పందాన్ని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) కుదుర్చుకుంది. దీనిలో భాగంగా అధీకృత ఆధార్ కేంద్రాలను మ్యాప్‌మై ఇండియా వారి మ్యాపుల్స్ యాప్‌లో ప్రదర్శించేందుకు మార్గం సుగమం అయింది. ఈ నిర్ణయం నివాసులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది.

ఈ నిర్ణయంతో, ప్రజలకు అధీకృత ఆధార్ కేంద్రాలను గుర్తించడం, వాటి వద్దకు చేరుకోవడంలో తోడ్పాటు లభిస్తుందని భావిస్తున్నారు. దీంతో పాటు, నివాసులకు వయోజనుల నమోదు, బాలల నమోదు, లేదా కేవలం చిరునామాతో పాటు మొబైల్ నంబరును అప్‌డేట్ చేయడం వంటి సేవల స్వభావాన్ని బట్టి ఆయా సేవల్ని అందించే ఆధార్ కేంద్రాలు ఎక్కడెక్కడ ఉన్నదీ కనుక్కోవడంలో సాయం ప్రజలకు సౌకర్యాల స్థాయిని పెంచడం, తప్పు సమాచారం పాలబడకుండా వారిని కాపాడడం ఈ సహకార పూర్వక ఒప్పందం లక్ష్యాలు. వీటితో పాటు నివాసులకు దేశవ్యాప్తంగా అత్యాధునిక ఆధార్ సేవా కేంద్రాలు (ఏఎస్‌కేస్), ఇతర ఆధార్ కేంద్రాల వద్దకు నిరాటంకంగా చేరుకొనేందుకూ వీలవుతుంది. ఈ ఒప్పందంపై సంతకాల కార్యక్రమాన్ని 2026 ఏప్రిల్ 1న పూర్తి చేశారు.

యూఐడీఏఐ సీఈఓ శ్రీ భువనేశ్ కుమార్ మాట్లాడుతూ, "యూఐడీఏఐ దేశ వాసులకు సేవ చేసే దృష్టితో పనిచేస్తోంది. ఈ రకమైన సహకారంతో పూర్తి భారత్‌లో ముందుగా సరి చూసిన ఆధార్ కేంద్రాల డిజిటల్ మ్యాపింగ్ సాధ్య పడుతుంది. ఆమోదిత ఆధార్ కేంద్రాల్ని సులభంగా వెతుక్కోవడంలో ప్రజలకు కూడా సాయం లభిస్తుంద"న్నారు.

రాబోయే కొన్ని నెలల్లో దీనిని అమలులోకి తీసుకు వచ్చిన తరువాత.. ఇది వినియోగదారులు మేపుల్స్ యాప్ లో వెదకినప్పుడు, ఆమోదిత ఆధార్ కేంద్రాల వైపునకు వెళ్లే దారిని వారు తెలుసుకోవచ్చును. యూఐడీఏఐలు అందించే ఆధార్ కేంద్రం సమాచారాన్ని మ్యాప్‌మైఇండియా మేపుల్స్ వేదికతో కలుపుతుంది. దీంతో ఆధార్ కేంద్రాల ఖచ్చిత చిరునామా, అక్కడ లభించే సేవల వివరాలు, డిజిటల్ మ్యాపింగ్, వివిధ కేంద్రాల జాబితా వంటి వాటిని గుర్తించడం సులభమవుతుంది.

మ్యాప్‌మైఇండియా సహ వ్యవస్థాపకుడు, సీఎండీ శ్రీ రాకేశ్ వర్మ మాట్లాడుతూ, "యూఐడీఏఐకి సేవలను అందించడం, మేపుల్స్ యాప్ ద్వారా ప్రజలకు ఆధార్ కేంద్రాల వద్దకు సులువుగా చేరుకొనే అవకాశాన్ని కల్పించడం నాకు దక్కిన సౌభాగ్యమ"న్నారు.

# భార్య మెడను కాలుతో తొక్కి.. దారుణంగా హత్య చేసిన బిల్డర్

బెంగళూరు, ఏప్రిల్ 3: డబ్బు విషయంపై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన బిల్డర్ అయిన భర్త, భార్య మెడను కాలుతో తొక్కి చంపాడు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం ఇచ్చి లొంగిపోయాడు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. నాగసాంద్ర ప్రాంతంలో నివసించే ధారియప్ప బిల్డర్. ఇంటి ఖర్చుల కోసం ఉంచిన రూ. 2 లక్షలు తన సోదరుడికి ఇవ్వాలని అతడు భావించాడు.

కాగా, గురువారం ఈ విషయంపై 35 ఏళ్ల భార్య కావ్య, ధారియప్ప మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన అతడు భార్యను కొట్టాడు. కిందపడిన కావ్య మెడను కాలితో బలంగా తొక్కడంతో ఆమె చనిపోయింది. ధారియప్ప తన భార్య మృతదేహం వద్ద రెండు గంటలపాటు ఉన్నాడు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఆ ఇంటికి చేరుకుని అతడ్ని అరెస్ట్ చేశారు.

# పెద్దాపూర్ నరసింహుడి రథోత్సవం



కరీంనగర్, ఏప్రిల్ 3: పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్‌లో శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం శుక్రవారం ఉదయం భక్తుల ఆనందోత్సాహాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది.

మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వనుల నడుమ ఉత్సవమూర్తులను రథంలో ఆసీనులను చేసి. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ప్రాంగణంలో నరసింహస్వామి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఆ దృశ్యాలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.తెలంగాణ పర్యాటకం

నరసింహుడి రథోత్సవం సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి వేర్వేరుగా దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఇక జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛయనీ ఘటనలు చోటుచేసుకోకుండా సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# సృజనాధారిత ఆర్థిక వ్యవస్థ పురోగతిని వేగవంతం చేస్తున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగం సహా మీడియా–వినోద రంగాన్ని ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోంది. సృజనాధారిత ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం, కంటెంట్ క్రియేషన్‌లో ప్రపంచ కేంద్రంగా భారత్‌ను నిలపాలనే ప్రభుత్వ దార్శనికతలో భాగంగా అనేక కార్యక్రమాలను ప్రారంభించారు.

2026–27 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ప్రకారం, దేశవ్యాప్తంగా 15,000 సెకండరీ పాఠశాలలు, 500 కళాశాలల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్ (సీసీఎల్) లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ కార్యక్రమానికి రూ. 250 కోట్లు కేటాయించారు.

2025 జూలై నుంచి ముంబయిలోని ఐఐసీటీ–నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎఫ్‌డీసీ) క్యాంపస్ నుంచి... ఏవీజీసీ–ఎక్స్ఆర్ రంగానికి ఎన్‌సీఓఈగా ఐఐసీటీ పనిచేస్తోంది. ప్రస్తుతం 18 కోర్సులను ప్రవేశపెట్టగా... వాటిలో 136 మంది విద్యార్థులు చేరారు. 15 మంది అభ్యర్థులు 'ట్రెయిన్-ది-ట్రెయినర్' కార్యక్రమాన్ని పూర్తి చేశారు. కంటెంట్ క్రియేటర్స్ ల్యాబ్‌ల ప్రణాళిక, సమన్వయం, దశలవారీ అమలు కోసం ముంబయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ)ని నోడల్ ఏజెన్సీగా నియమించారు. టెక్నాలజీ స్టాక్, లబ్ధిదారు సంస్థల గుర్తింపు, అమలు పద్ధతులకు సంబంధించిన వాటాదారుల సంప్రదింపులు కొనసాగుతున్నాయి.

ఏవీజీసీ–ఎక్స్ఆర్ రంగానికి ప్రోత్సాహం అందించడం, ఈ రంగ అభివృద్ధి కోసం ఒక సమగ్ర వ్యూహాన్ని రూపొందించి, విధానపరమైన చర్యలను సిఫార్సు చేయడానికి 2022 ఏప్రిల్ నెలలో ప్రభుత్వం ఏవీజీసీ ప్రమోషన్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఇది 2022 డిసెంబర్ నెలలో తన నివేదికను సమర్పించింది. ఈ రంగం గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని, 2030 నాటికి ఏవీజీసీ–ఎక్స్ఆర్, కంటెంట్ ప్రొడక్షన్, డిజైన్, ప్రోగ్రామింగ్, సంబంధిత రంగాల్లో సుమారు ఇరవై లక్షల మంది నైపుణ్యం కలిగిన నిపుణులు అవసరం కావచ్చని ఆ నివేదిక స్పష్టం చేసింది.

వరల్డ్ ఆడియో విజువల్, ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్–2025)ను ప్రభుత్వం ముంబయిలో నిర్వహించింది. "క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ ది వరల్డ్" కార్యక్రమం కింద కంటెంట్ సృష్టిలో భారత్‌ను ప్రపంచ కేంద్రంగా మార్చాలన్న ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా దీనిని నిర్వహించారు. 100కు పైగా దేశాలకు చెందిన ప్రపంచ స్థాయి కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు, ఓటీటీ వేదికలు, టెక్నాలజీ లీడర్‌లతో సంభాషించడానికి భారతీయ క్రియేటర్లు, నిర్మాతలు, అంకురసంస్థల కోసం ఈ సదస్సు ఒక సమీకృత వేదికను అందించింది.

వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్) ఆధ్వర్యంలో ప్రారంభించిన వేవ్ఎక్స్ స్టార్టప్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్... నిర్మాణాత్మక ఇంక్యుబేషన్, మార్గదర్శకత్వం, ప్రపంచవ్యాప్త నెట్‌వర్క్‌లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మీడియా–టెక్ అంకుర సంస్థలకు మద్దతునిచ్చింది. అంకుర సంస్థల తొలి బృందానికి పరిశ్రమ నిపుణుల నుంచి మార్గదర్శకత్వం, పెట్టుబడిదారులతో అనుసంధానం, మేధో సంపత్తి సృష్టి, రక్షణకు మద్దతు వంటి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. అంకుర సంస్థలు తమ ఆవిష్కరణలను విస్తరించుకోవడానికి వీలుగా ఈ కార్యక్రమం అంతర్జాతీయ వేదికల్లో భాగస్వామ్యం, పరిశ్రమ భాగస్వామ్యాలు, ప్రపంచ మార్కెట్‌ప్లేస్‌లతో అనుసంధానాన్నీ సులభతరం చేస్తుంది.

మీడియా–వినోద రంగంలోని సృజనాత్మక ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించి, ప్రదర్శించడానికి 'క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్' (సీఐసీ)ని ఒక జాతీయ వేదికగా వినియోగిస్తున్నారు. సీఐసీ మొదటి సీజన్‌లో, పరిశ్రమ భాగస్వాముల సహకారంతో 33 పోటీలను నిర్వహించారు. ఇది వేవ్స్ 2025లో ముగిసింది. ఈ సమ్మిట్‌లో దేశంలోని టయర్–ఎ2, టయర్–ఎ3 నగరాలు సహా అనేక ప్రాంతాల నుంచి లక్షకు పైగా క్రియేటర్లు పాల్గొన్నారు. ఎంపికైన క్రియేటర్లు వారి కంటెంట్‌ను జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించడానికి వేవ్ఎక్స్, వేవ్స్ బజార్ వంటి వేదికల ద్వారా వారికి మద్దతు నందిస్తున్నారు.

శ్రీమతి కృతి దేవి దేబ్‌బర్మన్, శ్రీ ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నలకు సమాధానంగా సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారాన్ని అందించారు.

# నకిలీ వార్తల కట్టడికి ప్రభుత్వ బహుళ అంచెల వ్యవస్థ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో ఫ్యాక్ట్ చెక్ విభాగం (ఎఫ్‌సీయూ) పని చేస్తోంది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన తప్పుడు సమాచారం, నకిలీ వార్తలను ఈ విభాగం గుర్తిస్తుంది. అధికారికంగా వార్తల వాస్తవికతను ధ్రువీకరించి, సరైన సమాచారాన్ని సోషల్ మీడియా వేదికల ద్వారా సరిహద్దు జిల్లాలతో సహా దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తుంది.

ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆన్‌లైన్‌లో ప్రచారంలో ఉన్న తప్పుడు సమాచారాన్ని, దేశ వ్యతిరేక కథనాలను పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం వేగంగా గుర్తించి అడ్డుకుంది. అబద్ధపు ప్రచారాలపై తక్షణమే స్పందించి, తనిఖీ చేసి.. వాస్తవ సమాచారాన్ని అందించడం ద్వారా తప్పుదోవ పట్టించే కథనాలు ప్రజల్లోకి వెళ్లకుండా ఆపింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో డిజిటల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న సుమారు 1,400కు పైగా యూఆర్ఎల్‌లను బ్లాక్ చేయాలని మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ యూఆర్ఎల్‌లలో తప్పుడు, తప్పుదారి పట్టించే, భారత్ వ్యతిరేక వార్తలు, పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే సోషల్ మీడియా ఖాతాల నుంచి మతపరంగా సున్నితమైన అంశాలు, భారత సాయుధ దళాలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే కథనాలు ఉన్నాయి.

సమాచార సాంకేతిక చట్టం 2000లోని సెక్షన్ 69ఏ ప్రకారం.. దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, దేశ రక్షణ, భద్రత, ప్రజా శాంతి పరిరక్షణకు భంగం కలిగించే వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాలు, పోస్టులను నిలిపివేయడానికి ప్రభుత్వం అవసరమైన ఆదేశాలను జారీ చేస్తుంది.

పైన పేర్కొన్న చర్యలతోపాటు వివిధ మీడియా వేదికలపై నకిలీ వార్తలను కట్టడి చేయడానికి, అందుబాటులో ఉన్న చట్టపరమైన, సంస్థాగత యంత్రాంగాల ద్వారా ప్రభుత్వం సాధ్యమైన అన్ని చర్యలను తీసుకుంటుంది. వీటిలో ముఖ్యమైనవి.

ప్రింట్ మీడియా: ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించిన 'పాత్రికేయ ప్రవర్తనా నియమావళి'ని వార్తాపత్రికలు తప్పనిసరిగా పాటించాలి. ఈ నిబంధనలు నకిలీ, పరువు నష్టం కలిగించే, తప్పుదారి పట్టించే వార్తల ప్రచురణను నిరోధిస్తాయి. ఈ నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ఫిర్యాదులు వస్తే..పీసీఐ చట్టంలోని సెక్షన్ 14 ప్రకారం కౌన్సిల్ విచారణ జరుపుతుంది. విచారణ అనంతరం తప్పు రుజువైతే సంబంధిత వార్తాపత్రికను, సంపాదకులను, జర్నలిస్టులను అభిశంసించడం, హెచ్చరించడం, మందలించడం వంటి చర్యలు తీసుకుంటుంది.

టెలివిజన్: కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ (నియంత్రణ) చట్టం 1995 కింద ఉన్న ప్రోగ్రామ్ కోడ్‌ను టెలివిజన్ ఛానళ్లు అనుసరించాలి. అసభ్యకరమైన, పరువు నష్టం కలిగించే, ఉద్దేశపూర్వకంగా అబద్ధాలు ప్రచారం చేసే లేదా సగం నిజాలతో కూడిన విషయాలను ప్రసారం చేయకూడదని ఈ నిబంధన స్పష్టం చేస్తోంది. కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ (సవరణ) నిబంధనలు 2021 ప్రకారం ఛానళ్లు ఈ కోడ్‌ను ఉల్లంఘిస్తే వాటిపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడానికి మూడు అంచెల ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం అందుబాటులో ఉంది. ప్రోగ్రామ్ కోడ్ ఉల్లంఘన జరిగినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటారు.

డిజిటల్ మీడియా: డిజిటల్ మీడియాలో వార్తలు, సమకాలీన విషయాలను అంశాలను ప్రచురించేవారు, ఆన్‌లైన్ క్యూరేటెడ్ కంటెంట్ ప్రచురణకర్తల కోసం సమాచార సాంకేతిక (మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమావళి) నిబంధనలు 2021 (ఐటీ రూల్స్ 2021) ఒక నైతిక నియమావళిని రూపొందించాయి. ఈ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడానికి మూడు అంచెల సంస్థాగత యంత్రాంగం పనిచేస్తుంది.

కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్‌ల (నియంత్రణ) చట్టం 1995 ప్రకారం ప్రోగ్రామ్ కోడ్, ప్రకటనల నియమావళిని పాటించేలా ప్రైవేటు శాటిలైట్ టీవీ ఛానెళ్లు ఖచ్చితంగా పాటించేలా సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు సలహాలు జారీ చేస్తుంది.

సరిహద్దు జిల్లాలతో సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రామాణికమైన, సకాలంలో, స్థానికంగా సంబంధిత సమాచారాన్ని అందించడంలో కమ్యూనిటీ రేడియో స్టేషన్లు కీలక పాత్ర పోషిస్తాయి. ఇక్కడ ప్రసారమయ్యే కార్యక్రమాలు స్థానిక సమాజానికి తక్షణ అవసరాలను తీర్చేవిగా, స్థానిక సమస్యలను పరిష్కరించేవిగా, తప్పుడు సమాచారాన్ని సమర్థవంతంగా అరికట్టేవిగా ఉండాలి. కమ్యూనిటీ రేడియోలో ప్రసారమయ్యే అంశాలపై నిర్ణయం తీసుకోవడానికి, స్థానిక ప్రాంత సభ్యులతో కూడిన 'అడ్వైజరీ అండ్ కంటెంట్ కమిటీ'ని ఏర్పాటు చేయాలి. ప్రేక్షకులకు సమాచారం సులభంగా అర్థం కావడానికి, మెరుగైన పంపిణీ కోసం ఈ కార్యక్రమాలను ప్రాధాన్యత ప్రకారం స్థానిక భాషలు, మాండలికాలలో ప్రసారం చేయాలి..

ఈ సమాచారాన్ని సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ లోక్‌సభలో శ్రీ ఉమ్మేద రామ్ బెనివాల్ అడిగిన ప్రశ్నలకు లిఖితపూర్వకంగా అందించిన సమాధానంలో వెల్లడించారు.

# మహంకాళి జాతరలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రత్యేక పూజలు



ఆదిలాబాద్, ఏప్రిల్ 3:కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం ఇందిరా నగర్ గ్రామంలోని స్వయంభూ శ్రీ కనకదుర్గా దేవి శ్రీ మహంకాళి దేవస్థానంలో శుక్రవారం మహంకాళి జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారి జన్మదినం సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకోగా, ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో నిండిపోయాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడం తిరుపతి గౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు దేవర వినోద్ స్వామి, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కోవా లక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు , ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# మాచర్లలో మహిళా అత్యాచారం.. కాళ్లు, చేతులు కట్టేసి పాశవికంగా దాడి

అమరావతి, ఏప్రిల్ 3:ఏపీలోని పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో ఒంటరి మహిళపై దుండగుడు అత్యాచారం చేసి పాశవికంగా హింసకు గురిచేసిన ఘటన సంచలనం కలిగించింది. ఈ ఘటనపై ప్రభుత్వం అదనపు ఎస్పీ స్థాయి అధికారిని విచారణ అధికారిగా నియమించింది .

సత్తెనపల్లికి చెందిన మహిళ ఉద్యోగం చేస్తూ మాచర్లలో ఒంటరిగా ఉంటుంది. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఆమె సత్తెనపల్లికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి కత్తితో బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు.

ఆమెను వివస్త్రను చేసి, కాళ్లు చేతులు కట్టేసి, దారుణంగా హింసించి పరారయ్యాడు. బాధితురాలిని వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌లో అనుమానితుడిని గుర్తించిన పోలీసులు అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

# మేడారం ఘటనకు మంత్రులదే బాధ్యత : రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డి

ములుగు , ఏప్రిల్ 3:మేడారం గద్దెల దగ్గర ప్రమాదానికి ముమ్మాటికి మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ బాధ్యత వహించాలని రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. హన్మకొండలోని హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ పొందుతున్న మేడారం పూజారి కుమారుడు యువన్ ను ఆయన పరామర్శించారు.

బాలుడి కుటుంబసభ్యులు తమ గోడు చెప్పుకుని కన్నీటి పర్యంతమయ్యారని ఆయన అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో, కాసుల కక్కుర్తితో ప్రమాదం జరిగి పసివాడు కాలును కోల్పోయి, మరో కాలు విరిగిపోయి ఉంటే ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. మంత్రి సీతక్క వచ్చి పరామర్శించి రూ. 10 వేలు చేతిలో పెట్టి చేతులు దులుపుకుని పోవడం దుర్మార్గమన్నారు.

వందేళ్లు నిలిచిపోయేలా నిర్మాణాలు చేపడుతున్నామని గప్పాలు చెప్పుకుని, గాలికి ఊడిపోయే నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. కమిషన్లు పంచుకుని, కాసుల కక్కుర్తితో వ్యవహరించిన మంత్రులు బాలుడిని ఆదుకునేందుకు ముందుకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ తప్పు ఒప్పుకోవాలని, ఆ పసివాడిని చూసి మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు.

బాలుడికి ప్రస్తుతం అయ్యే వైద్య ఖర్చులన్ని ప్రభుత్వమే భరించాలని, హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యాక, అతడి భవిష్యత్ కోసం ప్రభుత్వం కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాలుడి తల్లిదండ్రులిద్దరు చదువుకున్నవారేనని, వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ప్రతి దానికి సిట్‌లు, సీబీసీఐడీలు అంటున్న రేవంత్ రెడ్డి మేడారం ఘటనపై సిట్ వేసి నాసి రకం పనులకు సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు.. ఇద్దరు సబ్ రిజిస్ట్రర్ల వద్ద నగదు,డాక్యుమెంట్లు స్వాధీనం



వరంగల్, ఏప్రిల్ 3:వరంగల్ సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, డాక్యుమెంట్లు ఇద్దరు సబ్ రిజిస్ట్రర్ల నుంచి స్వాదీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రర్–1 జమాలపురం రామనరసింహారావు, సబ్ రిజిస్ట్రర్–2 దేవులూరి ఆనంద్ ఫోన్లను స్వాధీనం చేసుకుని పరిశీలించారు.

ఇద్దరు అధికారులు డాక్యుమెంట్ రైటర్లతో జరిపిన ఫోన్ పే పరిశీలించగా సుమారు రూ. 42 లక్షలు లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి 70 రిజిస్ట్రేషన్ కాని డాక్యుమెంట్లను పరివీలించారు. అదే విధంగా ఇద్దరు ఇళ్ల నుంచి రూ. 24.61 లక్షల నగదును, 819.500 గ్రాముల బంగారు ఆభరణాలను, 2.600 కిలో గ్రాముల వెండి ఆభరణాలను, రూ. 30 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు గుర్తించి ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు.

